21. రూ. 10,000-00 శ్రీమతి వి. సుభద్ర దేవి గారు, జిన్నూరు
కీ॥శే॥ పి. అన్నపూర్ణమ్మ గారి జ్ఞాపకార్థం, ఆత్మశాంతి కోరుతూ

22. రూ. 20,000-00 శ్రీ మాదిరెడ్డి శివప్రసాద్ గారు, కాకినాడ, వీరి తల్లి గారు
కీ॥శే॥ శ్రీమతి మాదిరెడ్డి చంద్రమతి గారి జ్ఞాపకార్థం

23. రూ. 5,000-00 శ్రీ ముదిగొండ పుష్పవల్లి గారు, W/o. Late M. విశ్వనాథశాస్త్రి గారు, వరంగల్
వీరి కుమార్తె కీ॥శే॥ కాశీనాధుని భార్గవి గారి జ్ఞాపకార్థము

24. రూ. 10,000-00 శ్రీ పోతుకూచి భాస్కరరావు గారు, శ్రీమతి పోతుకూచి వెంకట సుబ్బలక్ష్మి
గార్లు, బెంగుళూరు వీరి వివాహమయి 60 యేళ్ళు పూర్తి అయిన సందర్భంగా

## విరాళములు

1. రూ. 1,004-00 శ్రీ నేరెళ్ళ రఘునాధరావు గారు, తాడేపల్లి
2. రూ. 1,112-00 శ్రీ కాళీ గార్డెన్స్ ఆశ్రమము, నంబూరు
3. రూ. 1,120-00 శ్రీ గొవ్వాల లక్ష్మీనారాయణరావు గారు, రాజమండ్రి, అన్నదానం నిమిత్తం
4. రూ. 1,015-00 శ్రీమతి మల్లిడి వనజాక్షి గారు, వైజాగ్ C/o. భారతలక్ష్మి గారు
5. రూ. 2,000-00 శ్రీమతి కె. వెంకట సత్యలక్ష్మి నరసింహారావు గారు, హైదరాబాద్
6. రూ. 1,263-00 చిన్మయ మిషన్ భక్తులు, కోటప్పకొండ, లిఖితజపం దక్షిణ నిమిత్తం
7. రూ. 1000-00 శ్రీ కశిరెడ్డి సత్య వీరవెంకన్న గారు, యానాం
8. రూ. 1001-00 శ్రీ కొనగళ్ళ రామారావు గారు, చింతలపూడి, గోసంరక్షణ నిమిత్తం
9. రూ. 1000-00 శ్రీమతి ఆలమూరు సుగుణ గారు, విజ్ఞానగిరి
10. రూ. 1000-00 శ్రీ కుసుమంచి శ్రీనివాస్ గారు, వైజాగ్
11. రూ. 2,116-00 శ్రీ ఎన్.వి. నాగేశ్వరరావు గారు & బి. కామేశ్వరి గారు, హైదరాబాద్ (అఖండ దీపారాధన నిమిత్తం)
12. రూ. 2,000-00 శ్రీమతి ఎమ్. లలిత గారు, దుర్గ్
13. రూ. 2,000-00 శ్రీ పి. శ్రీనివాసరావు గారు, రాయపూర్
14. రూ. 5,000-00 శ్రీమతి ఎమ్. సీతాదేవి గారు, హైదరాబాద్

## విద్యాఖర్చులు - పిల్లల సంక్షేమం

1. రూ. 50,000-00 శ్రీ మర్రి రవీంద్రరెడ్డి గారు, సికింద్రాబాద్ - Education Fund

## గోశాల నిర్మాణము

1. రూ. 3,000-00 శ్రీ చైతన్య తపోవనము ఆశ్రమం, తాడేపల్లి
2. రూ. 5,016-00 పూజ్యశ్రీ స్వామి వాసుదేవానందగిరి గారు, పెదపులిపాక
3. రూ. 1100-00 పూజ్యశ్రీ దేవానంద స్వామీజీ గారు, శ్రీ శాంతి ఆశ్రమం
4. రూ. 5,120-00 శ్రీ నేరెళ్ళ రఘునాధరావు గారు, తాడేపల్లి
5. రూ. 1500-00 శ్రీమతి జి. గౌరి సుబ్బలక్ష్మి గారు, వసంతవాడ, గో గ్రాసం నిమిత్తం
6. రూ. 50,000-00 శ్రీ మర్రి రవీంద్రరెడ్డి గారు, సికింద్రాబాద్

## శ్రీ శాంతి ఆశ్రమ శతజయంతి ఉత్సవాలు

1. రూ. 10,116-00 శ్రీ భళ్ళమూడి శ్రీనివాస రామారావు గారు శ్రీమతి సూర్య కుమారి గారు, శ్రీ శాంతి ఆశ్రమం
2. రూ. 10,000-00 శ్రీ కర్నిడి సత్యనారాయణ గారు, శ్రీ శాంతి ఆశ్రమం
3. రూ. 10,116-00 శ్రీ మొండి నందకుమార్ గారు, శ్రీ శాంతి ఆశ్రమం
4. రూ. 10,000-00 శ్రీ ఆకొండి సూర్య ప్రకాశరావు గారు, శ్రీ శాంతి ఆశ్రమం
5. రూ. 1,116-00 శ్రీ ఆకొండి సూర్య ప్రకాశరావు గారు, శ్రీ శాంతి ఆశ్రమం



# ఓం

# శాంతి

విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక

స్థాపకులు : పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్‌జీ మహరాజ్

గౌరవ సంపాదకులు : స్వామిని వినమ్రానంద

సంపుటి : 93 మే - 2017 సంచిక : 5

## విషయసూచిక

| | | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన | 02 |
| 2. | ధ్యానము - అష్టావక్రగీత | 05 |
| 3. | ఆత్మతత్త్వమధనం - స్వామి తత్త్వవిదానంద | 07 |
| 4. | ప్రణవము - బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు | 09 |
| 5. | ధ్యానము - స్వామి ఓంకార్, అనువాదం : స్వామి తత్త్వవిదానంద | 13 |
| 6. | శ్రీ రామకృష్ణ పరమహంస అవతారం - స్వామి రఘునాయకానంద | 16 |
| 7. | పరోపకారార్థం - ఇదం శరీరం - హరిహర సుబ్రహ్మణ్యం | 21 |
| 8. | శాంతి స్థాపనం - ముక్త జీవనం - శ్రీ కె. రత్తయ్య | 23 |
| 9. | గోశాల పునర్నిర్మాణము | 29 |
| 11. | వార్తలు - విరాళాలు | 30 |

☛ ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి - రచయితలే బాధ్యులు కాని, సంపాదకులు కారు. - ఎడిటర్

*జీవిత సభ్యత్వం (12 సం॥) : రూ. 1000/-* *సాలుసరి చందా : రూ. 100/-*

# ప్రార్థన

1. గోష్పదీకృత వారాసిం మశకీకృత రాక్షసం
రామాయణ మహామాలా రత్నం వందేఽనిలా త్మజం
అంజనానందనం వీరం జానకీ శోక నాశనం
కపీశమక్ష హంతారం వందే లంకా భయంకరమ్ ॥

**తాత్పర్యం :-** సాగరమును గోష్పద జలమువలె భావించి లంఘించిన వాడును, దానవులను దోమలవలె సంహరించిన వాడును, రామాయణము అను మహామాలయందు శోభించు అద్భుతమైన రత్నమువంటి వాడును అగు అనిలాత్మజుడైన ఆంజనేయునకు వందనములు.

2. ఉల్లంఘ్య సింధోస్సలిలం సలీలం
యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః
ఆదాయ తేనైవ దదాహ లంకాం
నమామి తం ప్రాంజలి రాంజనేయమ్ ॥

**తాత్పర్యం :-** సాగరమును లంఘించి జానకియొక్క శోకాగ్నిని ఆర్పిన మహా యోధుడును, లంకానగరమును దహించిన వాడును అగు హనుమంతునకు చేతులెత్తి నమస్కరించుచున్నాను.

3. ఆంజనేయ మతిపాట లాననం
కాంచనాద్రి కమనీయ విగ్రహం
పారిజాత తరుమూల వాసినం
భావయామి పవమాన నందనం ॥

**తాత్పర్యం :-** ఎఱ్ఱనైన ముఖము కలవాడును, స్వర్ణగిరివలె కమనీయ రూపము గలవాడును, పారిజాత వృక్షము క్రింద నివసించువాడును, అగు ఆంజనేయుని స్మరించుచున్నాను.



4. యత్రయత్ర రఘునాథ కీర్తనం
తత్రతత్ర కృతమస్త కాంజలిమ్
బాష్పవారి పరిపూర్ణ లోచనం
మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥

**తాత్పర్యం :-** రామనామము ఎచ్చటెచ్చట గానము చేయబడుచుండునో, అచ్చట రెండు చేతులను తలపై నిడుకొని నమస్కరించుచు, నేత్రములలో ఆనంద బాష్పములు నింపుకొని యుండువాడును, రాక్షసులను వధించువాడును అగు మారుతికి వందనములు.

5. మనోజవం మారుత తుల్య వేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానరయూథ ముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి ॥

**తాత్పర్యం :-** మనస్సుకన్ననూ వేగముగా చరించువాడును, వాయు వేగము గలవాడును, జితేంద్రియుడును, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడును, వాతాత్మజుడును, వానర యోధులలో ముఖ్యుడును, శ్రీరామదూతయును అగు వాయునందనునకు శిరము వంచి నమస్కరించుచున్నాను.

6. నాదబిందు కళాతీతం ఉత్పత్తిస్థితి వర్జితం
సాక్షాదీశ్వర సద్రూపం హనుమంతం భజామ్యహం ॥

**తాత్పర్యం :-** మంత్రశాస్త్ర ప్రసిద్ధమయిన నాదము, బిందువుయను కళలకు అతీతుడయిన వాడును, పుట్టుట యుండుటయను క్రియలు లేనివాడున్నూ, సాక్షాత్తూ ఈశ్వర స్వరూపుడున్నూ అయిన హనుమంతుని సేవించుచున్నాను.

7. సర్వారిష్ట నివారకం శుభకరం పింగాక్ష మక్షాపహం
సీతాన్వేషణ తత్పరం కపివరం కోటిన్దు సూర్యప్రభమ్
లంకాద్వీప భయంకరం సకలదం సుగ్రీవ సమ్మానినం
దేవేంద్రాది సమస్త దేవవినుతం కాకుత్థ్సదూతం భజే ॥

**తాత్పర్యం :-** సమస్త అరిష్టములను నివారించువాడును, సమస్త శుభములను కలుగ జేయువాడును, పింగాక్షుడను రాక్షసుని సంహరించినవాడును, లంకాద్వీపమును గడగడ లాడించినవాడును, భక్తులకు సమస్తమూ యిచ్చునట్టివాడును, సుగ్రీవునిచే సన్మానింపబడిన వాడును, కోటి సూర్యులతో సమానమయిన కాంతి గలిగినవాడును, సీతాన్వేషణ యందు పరమాతురత గలిగినవాడును, దేవేంద్రుడు మొదలుగాగల సమస్త దేవతలచేతను మెప్పు పొందినవాడును, శ్రీరామచంద్రునకు దూతయును అయిన ఓ ఆంజనేయస్వామీ ! నిన్ను సేవించుచున్నాను.

**8. బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వ మరోగతా**
**సుదార్ఢ్యం వాక్పటుత్వం చ హనుమత్స్మరణాద్భవేత్ ॥**

**తాత్పర్యం :-** బుద్ధి బలము, యశస్సు, ధైర్యము, నిర్భయత్వము, రోగము లేకుండుట, సుదృఢత్వము, వాక్పటుత్వము హనుమంతుని స్మరించిన మాత్రమున కలుగుచున్నవి.

---

# గీతాంజలి

నేను వృథాగా గడిపిన కాలాన్ని తలుచుకుని పని లేని రోజుల్లో సోమరిగా చింతించాను. కాని కాలం ఎన్నడూ వృథా కాదు, ప్రభూ, నా జీవితంలో ప్రతీ క్షణాన్నీ నువ్వు నీ చేతుల్లోకి తీసుకున్నావు.

ప్రతిదాని హృదయంలో దాక్కుని, నువ్వు బీజాల్ని మొలకలుగా, మొగ్గల్ని పువ్వులుగా, పుష్పాల్ని ఫలాలుగా పోషిస్తున్నావు.

అలిసి సోమరిగా పక్కమీద పడుకుని లోకంలోని పనంతా ఆగిపోయింద నుకున్నాను. పొద్దున్నే లేచి పుష్పాలతో నా తోటంతా నిండిన చిత్రాన్ని చూసి విస్తుపోయాను.

**- రవీంద్రనాథ్ టాగూర్**



# ధ్యానము
# (అష్టావక్రగీత)

---

**శ్లో॥ నిస్సంగో నిష్క్రియోఽసి త్వం స్వప్రకాశో నిరంజనః ।**
**అయమేవ హి తే బంధః సమాధిమనుతిష్ఠసి ॥**

నీవు నిస్సంగుడవు, నిష్క్రియుడవు, స్వయంజ్యోతివి, నీలో ఏ మాలిన్యమూ లేదు, దీనిని ధ్యానించు, ఈ విధంగా నీ బంధాన్ని తొలగించుకో.

నీ మనశ్శరీరాలతో గాని, వానిచే అనుభవింపబడే వస్తువులతో గాని ఆత్మకు ఏ సంబంధమూ లేదు. స్తంభానికి భూతంతో గాని, దానివల్ల కలిగే కష్టనష్టాలతో గాని ఏ సంబంధమూ లేనట్టే, పరిమితమైనది మాత్రమే అపరిమితం కావాలనే కోరికతో కర్మలను చెయ్యగలదు. ఆత్మ అనంతమూ పూర్ణమూ కావడం వల్ల ఇందులో కోరికలూ లేవు, వాటి ఫలితమయిన కర్మలూ ఉండవు.

ఇది నిష్క్రియం. ఇది స్వయం జ్యోతి. కళంకరహింతగా "నిరంజనః" సర్వ వాసనలకు అతీతంగా, వాటిని చైతన్యవంతం చేస్తూ చిత్ రూపంలో మనలో సాక్షిగా ఉండి, స్థూల సూక్ష్మకారణ శరీరాలను చూస్తున్నది.

ఆత్మకు యే బంధమూ లేదు. ఇది నిత్యముక్తము. కాబట్టి దానికి ధ్యానంతో పని లేదు. ధ్యానం చేస్తున్నామంటే, ధ్యానించే, వేరుగా తలచే అహంకారం కొద్దిగానయినా మిగిలి ఉన్నట్టే. ఈ వేరు భావం పూర్తిగా పోయేదాకా బాగా మననం చెయ్యాలి. నిద్ర కోసం ప్రయత్నిస్తున్నంతసేపూ నిద్ర ఉండదు, నిద్ర పోతూ వుంటే నిద్ర కోసం ప్రయత్నమే ఉండదు! సర్వాన్నీ చైతన్యవంతం చేస్తూ సర్వానికీ సాక్షిగా ఆత్మే ఉంది, ఆ ఆత్మే నేను అనే భావం ధృడమయే దాకా మననం చెయ్యాలి. ఈ దృఢజ్ఞానం వచ్చేక 'నేను' కాని మనోబుద్ధులతో ధ్యానం ఎందుకు చేస్తాను?

ధ్యానం ద్వైతభావాన్నీ బంధస్థితినీ సూచిస్తుందనీ నిత్యముక్తమయిన ఆత్మ అయిన తనకు ధ్యానంతో పనిలేదని అనగలిగే అష్టావక్రుని వంటి ఆత్మనిష్ఠులు చాలా అరుదుగా ఉంటారు. బంధం ఉందన్న భావన ఉంటేనే ముక్తి కోసం ప్రయత్నిస్తారు. ధ్యానిస్తున్నామంటే శాస్త్రం చెప్పే దానిని సరిగ్గా అర్థం చేసుకోలేదని అర్థం అవుతున్నది, ఉన్నది ఒకే ఒక ఆత్మ, అదే స్వయం జ్యోతిగా, సర్వసాక్షిగా, సర్వత్రా ఉంది అన్నది సరిగ్గా అర్థం అయితే నేను

వేరుగా ఉండే అవకాశమే లేదు. వేరేలేనప్పుడు ధ్యానం ఎందుకు? కాబట్టి శాస్త్రం చెప్పేది అర్థం అయ్యేవరకూ శ్రవణమూ మననమూ చెయ్యడమే మన కర్తవ్యం.

చిత్తశుద్ధితో, నిజాయితీతో సత్యాన్నన్వేషించే సాధకునికి ఈ శ్లోకంలో అత్యంత విలువయిన సూచన ఉంది. బాహ్యంగా నేను చేస్తున్నాను, చూస్తున్నాను, అనుభవిస్తున్నాను మొదలయిన ఆలోచనలన్నీ అణిగిపోయినప్పటికీ, అంతర్గతంగా అహంకారం నేను ధ్యానిస్తున్నాను అనే ఆలోచనతో అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. ఈ విధంగా బీజప్రాయంగానయినా ఆలోచన ఉందంటే, అది ఎప్పుడు మహారణ్యంగా విస్తరిస్తుందో మనకే తెలియదు, ధ్యానం మళ్ళీ గుర్తువచ్చేసరికి మనం ఎక్కడయినా ఉండవచ్చు. ధ్యాననిష్ఠలో చివరి దశకు చేరిన వారందరిలోనూ బహుశా, ఈ 'నేను ధ్యానిస్తున్నాను' అన్న భావన ఆటంకంగా ఉంటుంది కాబోలు. ఈ దశను దాటి ధ్యానాన్ని వీడి ధ్యేయ స్థితిలో ఉండడం కష్టమవుతూ ఉంటుంది వీరందరికి. అందుకే ఈ శ్లోకంలోని సూచన సాధకులకు అత్యంత విలువైనది, తనలో అంతర్గతంగా తెలియకుండా మిగిలిపోయిన కర్తృత్వభావన ధ్యానంగా మిగిలిపోతుంది.

---

### శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి !

- శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.
- సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే). M.O. ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.
- M.O. ఫారంలో దిగువ For Communication భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.
- చందా కాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొంటే మంచిది.
- అడ్రసు మార్పును ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి.
- చందా వివరములు తెలుపని యెడల సొమ్మును విరాళముగా జమ చేయబడును.

**కార్యదర్శి, శాంతి ఆశ్రమం (PO)**
వయా శంఖవరం-533 446, తూ॥గో॥ జిల్లా.



# ఆత్మతత్త్వమధనం

**- పూజ్యశ్రీ స్వామి తత్త్వవిదానంద**

***(శ్రీ శాంతి ఆశ్రమ శతాబ్ది ముగింపు ఉత్సవాల సందర్భంగా తేది 20.01.2017న ఇచ్చిన దివ్య సందేశ సారాంశము)***

'శాంతి ఆశ్రమం'కి రావడము నా భాగ్యంగా భావిస్తున్నాను. 'శాంతి ఆశ్రమం' జ్ఞాన ప్రదాయకం, ధ్యాన కేంద్రం. సాధకులకు స్ఫూర్తినిచ్చే గ్రంథాలెన్నో శాంతి ఆశ్రమం ప్రచురించినది. స్వామి ఓంకార్ వారి పుస్తకాలు నా హృదయానికి హత్తుకొన్నాయి. శ్రీ శాంతి ఆశ్రమ జయంతి సందర్భముగా నా భావాలు ప్రకటిస్తున్నాను. మన సమాజం కర్మకాండకు, వేద సహిత యజ్ఞయాగాదులకు అలవాటు పడింది. వీటికతీతంగా నిధి, ధ్యాస, ధ్యానంను ఆచరించి ఓంకార స్వామీజీ ప్రజలకు బోధించారు. కాని సమాజంలో జనులు ఓంకారస్వామి గాఢత గుర్తించలేకపోవడం సహజము.

'నేను' (ఆత్మ స్వరూపం) తెలుసుకోవడానికి ప్రయత్నించరు. ఏవేవో పేర్లు పెట్టి స్మరిస్తున్నాం. 'నేను' అనే స్వరూపాన్ని తెలుసుకోకుండా అవిద్య, అజ్ఞానము, మాయలో చిక్కుకుపోవడము వలన మన ఆత్మ స్వరూపం (నేను) తెలుసుకోలేకపోతున్నాము. మానవుడు సృష్టి రహస్యాలు (తెలుసుకోవడానికి) ఛేధించడానికి ప్రయత్నిస్తాడు గాని 'నేను' (ఆత్మ స్వరూపం) తెలుసుకోవడానికి ప్రయత్నించడు. నేనెవరు? భగవంతుడెవరు? ఇంద్రియ గోచర జగత్తు (దృశ్య ప్రపంచం) వాస్తవికత ఎంత? అనే విషయాల గురించి లోతుగా మనము ఆలోచించము. దేవుడిని పూజించే హడావుడిలో ఉంటాం.

పరబ్రహ్మ జీవుడి రూపంలో ఉంటాడనే సత్యాన్ని గ్రహించలేకపోతున్నాము.

శంకరుల తర్వాత ఆత్మతత్త్వాన్ని ప్రతిపాదించినవారు, ఆత్మ స్వరూప నిరూపణకు పూనుకొన్న మహనీయులు శ్రీ రమణ మహర్షి, స్వామి వివేకానంద, స్వామి శివానంద, స్వామి రామతీర్థ, ఓంకార స్వామి.

కర్మ ఉపాధుల వలన జ్ఞానమార్గంలో ప్రవేశించలేకపోతున్నాం. ఎందుచేతనంటే వ్రతాలు, నోములు, యజ్ఞ, యాగాదులు ఆచరిస్తూ ఉండడము వలన మన స్వస్వరూపమైన (ఆత్మ) 'నేను'ను తెలుసుకోలేకపోతున్నాము.

మూఢ భక్తి, విశ్వాసాలతో చేసే కర్మలు, ఉపాసనలకు జనులు ఆకర్షితులవుతున్నారు.

ఈ ఆకర్షణలు ప్రక్కన పెట్టి ఆత్మ విచారణ, శుద్ధమైన ఆత్మనిష్ఠ వైపు దృష్టి సాగించాలి. ఈ మహాత్ముల భావనలు ప్రచారం చేయాలంటే వివేకానంద, రామతీర్థ, స్వామి ఓంకార్‌ల పుస్తకాలన్నింటని క్రోడీకరించి సంపుటాలుగా వెలువరించాలి. ప్రస్థాన త్రయం సాధకులకు కరదీపికలు. సాధకుల జీవితంలో వెలుగు తేవడానికి ఓంకారస్వామి పుస్తకాలు వ్రాశారు. ఓంకారస్వామి ఇంగ్లీషులో వ్రాశారు. వాటిని తెలుగులో అనువాదం చేయాలి. స్వామి ఓంకార్ బోధనల ప్రాముఖ్యత, జీవనశైలి వంటి అంశాలపై పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథాలు వ్రాయడానికి యూనివర్సిటీలలో తీర్మానం ప్రవేశపెట్టాలి.

మననం, నిధి, ధ్యాసలతో 'ఆత్మతత్త్వమధనం'పై స్వామి ఓంకార్ గ్రంథం ఉత్కృష్టంగా ఉంది. ఆసనముపై ప్రాముఖ్యం ఎక్కువ ఇస్తే హఠయోగం అవుతుంది. స్వామి ఓంకార్ హఠయోగం తిరస్కరించి ఆసనం ప్రాధాన్యం, ధ్యానం సిద్ధించడానికి అని చెప్పారు. దేహాభిమానం నుండి విముక్తి పొందడమే ధ్యానం యొక్క ప్రాముఖ్యం. ఈశ్వర ఆరాధన అంటూ దేవాలయం, విగ్రహం, చెట్టు చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ ఉంటారు. 'దేహమే' నేను అని అనుకోవడము వలన మనస్సు భగవంతునిపై పెట్టరు. అప్పుడు ఎన్ని వ్రతాలు చేసినా వ్యర్ధమే. ధ్యానమనేది వివేకంతో ప్రారంభమవుతుంది. దేహాభిమానం నుండి బయట పడడానికి ధ్యానం. దేవాలయంలో అడుగు పెట్టినప్పుడు భక్తుడుగా అడుగు పెట్టాలి. కోరికతో వెళ్ళకూడదు.

ఏ విగ్రహమైనా ఓంకారమే. ఏ ఆకారమైనా ఓంకార రూపంగా భావించాలి. నామరూపాల జంఝూటంలో ఇరుక్కోకూడదు. ఓంకార రూపంగా భావించి ప్రార్థించాలి.

## వార్తలు - విశాఖపట్నం

**తేది. 29.03.2017న వసంత నవరాత్రులు శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ సహిత అష్టోత్తర శతనామార్చనలు ప్రారంభించబడినవి. వ్యాస విరచిత ఆధ్యాత్మ రామాయణం పారాయణ, మల్లవరం అవధూత భక్తమండలి వారిచే అఖండ హరేరామ నామ సంకీర్తన, శ్రీ కోదండ రామానుజాచార్య బృందముచే సంకీర్తన జరిగినవి. తేది. 05.04.2017న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవము శ్రీ కోదండ రామానుజాచార్యుల మారుతీ బృందము వారిచే నిర్వహించబడినది. సుమారు 2000 మందికి అన్నదానము జరిగెను.**



# ప్రణవము

## (శ్రీ శాంతి ఆశ్రమం శతజయంతి ఉత్సవాల సందర్భంగా తేది. 30-11-2016న కాకినాడ శాఖలో ఇచ్చిన దివ్య సందేశము)

*- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు*

(మార్చి సంచిక తరువాత)...

"అహం బ్రహ్మాస్మి" "తత్త్వమసి", 'తత్', 'త్వం', 'అసి' ఇది. దీనిని 'విచారణ మార్గము' అంటారు. శ్రీ శంకర భగవత్ పాదులు ప్రచారం చేసిన మార్గం – 'జ్ఞాన మార్గం'. అందులో 'విచారణ మార్గము' నందు 'అకార, ఉకార, మకారము'లను విచారణ చేసినప్పుడు, మీకొక విషయం అర్థం అవుతుంది. సాధారణంగా ఒక స్థాయిలో నున్నటువంటివారిని, మీరు బ్రహ్మ గారు ఈయన ఏం చేసారు అని విచారణ చేసినప్పుడు చతుర్ముఖ బ్రహ్మ కేవలం సృష్టిని మాత్రమే చేస్తారు అని, కాని మీరొక్క విషయాన్ని జాగ్రత్తగా పరిశీలన చేయండి. సృష్టిని చేసేటటువంటివాడు మాత్రమే బ్రహ్మ అని నేను అన్నాననుకోండి. మరి రాక్షసులు, బ్రహ్మగారి గురించి తపస్సు చేస్తున్నారా? లేదా? తపస్సు చేసినందుకు బ్రహ్మగారు ప్రత్యక్షమై, "నాయనా! నేను ఏం చేస్తానురా సృష్టి చేయగలను. మీకు కావాలంటే శరీరం పడిపోయినాక మరో శరీరం ఇస్తానంతే. నేను నీకేం ఉపకారం చేయగలను?" పైగా మీరు ఇంకో విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించండి. బ్రహ్మ గారికి శరీరం ఇవ్వడంలో స్వేచ్ఛ లేదు. మనం ఏ కర్మలు చేసామో, ఏ పాపపుణ్యములు చేసామో, ఆ పాపపుణ్యములను సుఖదుఃఖములుగా అనుభవించడానికి అనువైన శరీరాన్ని ఆయన ఇస్తూ వుంటాడు. అంతేగాని కోటేశ్వరరావు అంటే నా కిష్టమండీ వచ్చే జన్మలో ఆయన్ని మహర్షిని చేస్తాను! ఫలానా వారంటే నాకిష్టం లేదు ఆయన్ని జెర్రిని చేస్తాను! అంటే ఆయనకేమీ అధికారం లేదు. పైగా ఒకసారి సృష్టించేసారు అనుకోండి! ఆ తరువాత బ్రహ్మగారు చేయడానికేం లేదు. అయినప్పుడు అసలు బ్రహ్మ గారికి ఆరాధన ఎందుకుంటుంది? 'ఓం'కారములో 'అ'కారమునకు పూజనీయత ఏది? ఆయన ప్రయోజనము ఏముంది మనకు? ఒకసారి సృష్టి జరిగిపోయింది అనుకోండి, ఇక మళ్ళీ మీకు వేరొక శరీరాన్ని ఆయన ఇప్పటికిప్పుడు ఇవ్వడు గదా! ఇవ్వనప్పుడు మీరు ఆయనను ఆరాధన చేసేటటువంటి ప్రయత్నం చేస్తారు. ఆయన కేవలం సృష్టి ఒక్కటే చేస్తారు అనుకోండి! అప్పుడు ఒక్క విషయం జాగ్రత్తగా గమనించండి. రాక్షసులు ఆయన గురించి తపస్సు చేస్తారు. బ్రహ్మగారు ప్రత్యక్షం అవుతారు. మీరు అనేక కథలలో, పౌరాణిక కథలలో వినేవుంటారు. బ్రహ్మగారిని వాళ్ళడుగుతారు.

"మాకీ వరం కావాలి!" అని అడుగుతారు.

"గాలిన్ కుంభిన్ అగ్ని అంబుదులు ఆకాశ
స్థలిన్ దిక్కులున్ రేలన్ ఘస్త్రంబులన్
తమప్రవంబున భూరిగ్రహ రక్షోమృగ వ్యాలందిశ్చ
నారాది జంతు కలహ వ్యాప్తిన్
సమస్త అస్త్ర శస్త్రాణి మృత్యువు లేని జీవనము లోకాధీశ"

ఇప్పించవే అంటారు. "స్వామి నేను భూమిమీద చచ్చిపోకూడదు, ఆకాశంలో చచ్చిపోకూడదు, మంటల్లో చచ్చిపోకూడదు, నీళ్ళల్లో చచ్చిపోకూడదు, గాలిలో చచ్చిపోకూడదు, ఇంటి బయట చచ్చిపోకూడదు, ఇంటిలోపల చావకూడదు, ప్రాణమున్న దానితో చావకూడదు, ప్రాణం లేని దానితో చావకూడదు. దేవతలు, గంధర్వులు, యక్షులు, కిన్నెరలు, కింపురుషులు వీరెవ్వరితో కూడ నేను చావకూడదు" అంటాడు. అయితే ఒక కోరిక కోరాడా? లేదా? ఒక కోరిక కోరినప్పుడు అది తీరుతుంది అని అనుగ్రహిస్తే అది రక్షణ చేసినట్లు కదూ! కోరిక తీర్చినట్లయ్యిందా లేదా? ఒకడి కోరిక తీరి, సంతృప్తి పొందితే అది స్థితికర్త లక్షణం అవుతుంది. ఇప్పుడు బ్రహ్మగారు వరము ఇచ్చారు అని అనేక చోట్ల మీరు చదివారా? లేదా? బ్రహ్మగారు కేవలం 'సృష్టికర్త' అని మీరు ఎలా చెబుతారు? బ్రహ్మగారు 'స్థితికర్త' కూడా అయ్యాడు గదా! అలాగే 'స్థితి కర్త' అంటే 'కేవలము రక్షించేటటువంటివాడు' అని నేనన్నాననుకోండి! 'స్థితి' అన్న మాటకు అర్థమేమిటి? రక్షణం చేయడం – దాన్ని కాపాడటం. "స్థితికర్త ఎవరు?" "విష్ణువు స్థితికర్త". 'విష్ణువు' ఎల్లవేళలా 'రక్షణ' మాత్రమే చేస్తాడు. ఇంకేమి చేయడు అని నేనన్నాననుకోండి! మరి ఆయన దశావతారాలు స్వీకరించాడా? లేదా? ప్రధానమయినటువంటి అవతారములు దశావతారములు. వేదోద్ధారణ, మందరోద్ధరణ, పృథ్వీధర్మ నిర్వహణ

ప్రహ్లాద త్రాణ బలిప్రతారణ నృపాహంకార నిర్వాపణ
వైదేహిరమణ ధనంజయ జయవ్యాపారపారీ
నక్షోణీ దివ్యత్కరుణా తమోహరణా తంత్రీ వేంకటేశ ప్రభో!

అని, దశావతారములు అంటే – క్రిందికి దిగి వస్తున్నాడు. ఎందుకు క్రింది దిగి వస్తున్నాడు? ఆయనే చెప్పాడు. "నేను ధర్మాన్ని రక్షించడానికి వస్తుంటాను" అని అన్నాడు.

"పరిత్రాణాయ సాధూనాం
వినాశాయ చదుష్కృతామ్" అన్నాడు భగవద్గీతలో

నన్ను ఒక రూపంలో చూడాలని కోరుకున్నవాళ్ళకి కనబడడంకోసమని చెప్పి వస్తూ



ఉంటాను. ఎవరైతే ధర్మమునకు వ్యతిరేకముగా ప్రవర్తిస్తూవుంటారో, వాళ్ళని సంహారం చేస్తానన్నాడు. రామావతారంలో వచ్చాడు. ఒకర్నా, ఇద్దరినా! ఎంతమందిని చంపేసింది రామావతారం. "ధర్మం" కోసం చంపాడు. ఆయనేం ఆక్రోశంతోటో, పైశాచికత్వంతోటో చంపలేదు. ధర్మ వ్యతిరేకమైనటువంటి రాక్షసులందర్నీ సంహరించాడు. ఇది మామూలు సంహారం కాదు.

"బందన భీము ఆప్తజన బాంధవుడు ఉజ్వల
బాణ తూన కోదండ కళాప్రచండ
భుజతాండవ కీర్తికి రామ మూర్తికిన్, రెండవ సాటి దైవము
ఇకలేదనుచున్ జతకట్టి వీరునకా డాండడ డాండ నిడాండన
కోదండము మత్తవీదండము నెక్కి చాటెదము దాశరధీ కరుణాపయోనిధీ" అంటారు గోపరాజుగారు.

అలా కొన్ని కోట్లమంది రాక్షసుల్ని సంహరించాడు. కృష్ణ భగవానుడు – అసలు కన్నులు తెరువని కడుచిన్న పాపడై దానవులని సంహరించాడు.

అతిచిన్న పాపడైయుండగా పూతన యొక్క పాలు త్రాగి పూతనను సంహరించెను. మరి ఇంతమంది రాక్షసులను సంహరించినప్పుడు ఇంతమందిని పడగొట్టినపడు కురుక్షేత్ర సంగ్రామ భూమియందు ఎంతమందిని పడగొట్టాడు కృష్ణ భగవానుడు తాను నిమిత్తంగా నిలబడి. తనే చెప్పాడు గదా! భగవద్గీత నందు.

'నిమిత్త మాత్రం భవసవ్యసాచిన్' అన్నాడు. "నువ్వు చంపడమేమిటి?" "నువ్వు నిమిత్తం", "నేనూ చంపింది" అన్నాడు. కాబట్టి, విష్ణువు స్థితికర్త మాత్రమే, ఆయన రక్షణ ఒకటే చేస్తాడు, అని నేను అన్నాననుకోండి! రాక్షసుల్ని చంపడం సజ్జనులకు రక్షణేమో కాని, ఆ రాక్షసుడి విషయంలో, ఆయన భార్యల విషయంలో, ఆయన పిల్లల విషయంలో ఎలా రక్షణ అన్వయం అవుతుంది? మరి అప్పుడు ఆయన చంపుతున్నాడు గదా! "ఆయన స్థితికర్త మాత్రమే, ఎప్పుడు రక్షణ వినా ఆయనకేం తెలీదు" అని మీరు ఎలా చెప్తారు.

"ప్రళయకర్త :– లయకర్త అంటే పరమేశ్వరుడు. ప్రళయం మాత్రమే చేస్తాడండీ, చాలా మంది శివుడి పేరు చెబితే భయపడుతుంటారు". మహాప్రళయ యొక్కటే శివుడు చేస్తాడు" అని నేనన్నాననుకోండి! మార్కండేయుడి యొక్క రక్షణ ఎవరు చేసారు?

"చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమాం !
చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర రక్షమామ్" అని ఊరుకోలేదు.

మార్కండేయుడు ఒక మాటన్నాడు

"చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్యతివై యమః"

"నేను చంద్రశేఖరుణ్ణి శంకరుణ్ణి ఆశ్రయించయుండగా, యముడు నన్నేం చేస్తాడు" అన్నాడు. ఇలా అంటాడా! అని చెప్పి శివలింగానికి, మార్కండేయునికి కలిపి ఉచ్చు వేశాడు యమధర్మరాజు గారు. వెంటనే శంకరుడేం చేశాడు. తన ఎడమ పాదంతో యమధర్మరాజుని చంపితే, అందర్నీ చంపేవాడు చనిపోయాడు.

"వక్షస్థానము నంతట కశ్యప కసినాటక సంహార సంవర్ధనమ్
కంవేదనం బృగ్ బృహస్పతిం నమఃసురచిర కోటీర సంఘర్షణమ్
మృదులస్య తావక ప్రదద్వంద్వస్య....... గౌరీపతే మశ్చిలే
మణిపాదుకా వితరణం......... శంభో సదాంకురో అంటారు

శ్రీ శంకర భగవత్పాదులు "శివానందలహరి'లో మరి మార్కండేయుణ్ణి రక్షించాడా? లేదా? త్రిపురాసురుణ్ణి సంహరించాడా? లేదా? గజాసురుణ్ణి సంహకరించి లోకాలను కాపాడాడా? లేదా? ఆయన లోకములను కాపాడినప్పుడు ఆయన స్థితి కర్తేగా! ఎంతో మందికి వరాలిచ్చాడా? లేదా?

"జ్ఞానదాతా మహేశ్వరః" అంతవరకెందుకు, లోకంలో ఎవరికైనా జ్ఞానము కలగాలి అంటే, 'శివభక్తి' వినా మార్గము లేదు. కాబట్టి శంకరుడు జ్ఞానదాతయై ఉన్నాడు. అటువంటి మహానుభావుడు ఆయన ప్రళయ మొక్కటే చేస్తాడు అని మీరు ఎలా చెబుతారు.

*(సశేషం...)*

# దైవసాయుజ్యము

**బ్రహ్మశ్రీ సాంబమూర్తి గారు (జైపూర్ వాస్తవ్యులు) 20 సంవత్సరాలకు పైగా శ్రీ శాంతి ఆశ్రమంలో వానప్రస్థ జీవనాన్ని సాగిస్తూ ప్రతిదినము వీరు పూజ్య ఓంకార్‌స్వామి వారి సమాధి మందిరములో పాదుకార్చన, ఆశ్రమంలో జరిగే ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమంలో సత్సంగమును నిర్వర్తిస్తూ విశ్రాంతి అనేది ఎరుగక ఆశ్రమమే వారి శ్వాసగా భావిస్తూ సర్వవేళలా భగవంతుని స్మరిస్తూ ఆశ్రమ సేవా కార్యక్రమము చేస్తూ, వారి జీవితమును సార్ధకము చేసుకొన్న నిష్కామ కర్మయోగి, ధన్యజీవి. వారి శరీరము సహకరించనప్పటికినీ ఆశ్రమ శత జయంతి ఉత్సవములో పాల్గొని తరించిన ధన్యజీవి. ది. 16-04-2017న వారు దైవ సాయుజ్యము పొందిరి. వారి ఆత్మశాంతి కోరుతూ ఆశ్రమవాసులు ప్రార్థన చేసిరి. వారి కుటుంబసభ్యులకు ఆధ్యాత్మి మానసిక శక్తిని భగవంతుడు ప్రసాదించుగాక. ఓం తత్సత్.**

భగవత్‌సేవలో... 'జ్ఞానేశ్వరి మాతాజీ'



# ధ్యానము

**ఆంగ్లమూలం : స్వామి ఓంకార్** **అనువాదం : స్వామి తత్త్వవిదానంద**

*(గత సంచిక తరువాత...)*

ప్రారంభమునుండి నీ దృక్పథమును సరిదిద్దుకో. తరువాత, అంటే సత్యము యొక్క దృష్టిని – ఏకత్వము నందు ఏకాగ్రమైన దృష్టిని – నిలిపిన పిదప, సుఖకరమైన ఆసనమును ఏదో ఒకదానిని ఎంచుకొనుము. ఆ ఆసనము ఎలా ఉండాలంటే, నీవు చాలాసేపు అలసట గాని, దేహదృష్టి గాని లేకుండా, కూర్చుండగలగాలి. ఫలానా ఆసనము అనే నియమము లేదు. కుర్చీకి చేర్లబడి కూర్చుండవచ్చును, లేక చేతులను కాళ్లను చాపి కూర్చుండవచ్చును, లేదా వెల్లకిలా పరుండవచ్చును కూడా. దేహాభిమానమును పూర్తిగా విస్మరించగలిగితే చాలు. అప్పుడు మనస్సులోని బరువు బాధ్యతలనన్నింటిని విడిచిపెట్టి, మనస్సును పూర్తిగా శాంతముగా విశ్రాంతిగా ఉండనిమ్ము. ఆలోచనలయందు తగుల్కొనకుండా, ఆలోచించే ప్రయత్నమును ఏమీ చేయకుండా, మనస్సు శాంతమై కుదురుగా ఉండునట్లు చూచుకో. ఇప్పుడు నిన్ను నీవే, నేను యెవరు? నేను అద్వయ (రెండవది లేని) ఏకైక సత్యతత్త్వమునా? అని ప్రశ్నించుకొనుము. నీవు విభజించ శక్యము కాని ఏకైక దైవతత్త్వము అనే విషయంలో నీ హృదయంలోనికి శంక ఏదైనా ప్రవేశిస్తూనే, శివోహమ్! శివోహమ్! శివోహమ్! అని జపించుము. నిస్సందేహముగా నేనే శివుడను అని ఆ మాటకు అర్ధము. అహం బ్రహ్మాస్మి, నేను పరబ్రహ్మనై ఉన్నాను, నిశ్చయముగా పరబ్రహ్మను నేనే, రెండవది లేని ఏకైక దైవతత్త్వము నేనే, అనే వేదము యొక్క చాలా గొప్ప మహావాక్యమును కూడ గుర్తు చేసుకొనుము.

దేవుడు బయటనుండి, లేదా కొంత దూరము నుండి, ధ్యానము ద్వారా మనకు దర్శనమిస్తాడని తలపోయుట అజ్ఞానము. ధ్యానము ద్వారా మనము దైవత్వంలోనికి మారిపోతాము అని తలపోయుట కూడ అజ్ఞానమే. అటువంటిది ఏదీ లేదు! ఇప్పటికే నీవు అదియే అయి వున్నావు. మనము అనంతకాలము నుండి ఆ దైవతత్త్వమే అయి ఉన్నాము. ఆ దైవము ఒక్కటి. సర్వము అగు ఆత్మ ఆ దైవమే. సర్వకాలములయందు సర్వమును వ్యాపించి సర్వమునకు అంతర్యామియై ఉన్నది ఆ దైవమే. మనము అనాది నుండియు ఆ బ్రహ్మయే, దైవత్వమే, అయి ఉన్నాము. ఏకత్వము అనే సత్యము ఎన్నటికీ చెదిరిపోరాదు. మనము దేహమే నేను అనుకుని గందరగోళంగా ఏడుస్తూ ఆ సత్యము నుండి విముఖులము కారాదు. మీ మనస్సులలో దృఢమైన నిశ్చయమును చేసుకోండి. శాశ్వత కాలము ఉండేట్లా సందేహము

లేకుండా ప్రతిష్ఠించుకోండి. ఈ విధముగా కొంత కాలము దేవుని ఉనికిని అభ్యాసము చేయండి.

ఇక ఇప్పుడు ధ్యానము వలన సిద్ధించే వస్తువు లేక ప్రయోజనము ఈ లోకంలో ఏమి ఉన్నది? మనము ధ్యానము వలన ఇప్పుడు సాధించేది లేదా పొందగలిగేది ఏదైనా ఉన్నదా? లేదు, సుతరాము లేదు. మనమే దైవస్వరూపులమై ఉండగా, ఆ సత్యము మనకు తెలుస్తూ ఉంటే, ఇంతగా ధ్యానము చేయవలసిన అక్కరయే లేదు. మనము ధ్యానము చేసేది ఆ చేతనను కోల్పోకుండా స్థిరముగా నిలబెట్టుకొనుట కొరకు మాత్రమే. దాని వలన మనము సర్వకాలములయందు ఏ దైవమై ఉన్నామో, ఆ దైవస్వరూపులముగనే ఉండగల్గుతాము. మనము ఏది కామో అది అవకుండా ఉండగల్గుతాము. మనము దైవమును పొందుటకు గాని, లేదా దైవము అగుటకు గాని, ధ్యానమును చేయుట లేదు సుమా! ధ్యానమునకు ప్రయోజనము అది ఎన్నటికీ కాదు! అదే ధ్యానమైతే దాని వలన మనము మన స్వరూపము నుండి, మనము దైవస్వరూపములో అంతర్గతులము అనే సత్యము నుండి, ఏకత్వము అనే సత్యము నుండి, చాలా దూరము లాగివేయబడతాము. మన ఏకాగ్రత సత్యదూరమై పోతుంది. మనము ఇప్పుడే మన స్వరూపము నందు రెండవది లేని ఆ ఏకసత్యమై ఉన్నాము. ఏది ఉన్నదో, అది ఒక్కటియే! అది నీవే అయి ఉన్నావు. తత్ త్వమ్ అసి! అదియే ఇది! ఇది జీవన సిద్ధాంతము, ఇది సద్వస్తువు యొక్క సిద్ధాంతము. కాబట్టి, ధ్యానము నందు కూడా నీ దృష్టిని దానికి దూరము కానియ్యకుము. అట్లు చేసినచో, ధ్యానము యొక్క ప్రయోజనమే పరాస్తమగును.

కాబట్టి ధ్యానము ద్వారా ఏదో ఒక కొత్తదానిని పొందాలనే ఆదుర్దా నీకు వద్దు. కొత్త దేవుడిని అయినా పొందాలి అనే ఆదుర్దా వద్దే వద్దు. కాని ఒక సంగతిని మాత్రం మరువవద్దు. నీవు ఇప్పటికే ఏది అయి ఉన్నావో, అది విస్మృతికి రాకుండా, ఆ సత్యము దూరము కాకుండా, జాగ్రత్త పడాలి. నిత్యసత్యము, అఖండము, అఖండ్యము అగు పరమాత్మ, నీవు అనాదికాలము నుండి ఒక్కటియే అనే సనాతనమైన (నిత్యమైన) సత్యమునకు నీవు దూరము కారాదు. అతిప్రాచీన దినము (కాలము) కూడ నీవే అయి ఉన్నావు. అనంతము నుండి అనంతము వరకు, నీవు అదియే అగుచున్నావు! నీవు దైవమే అగుచున్నావు! ఈ సత్యముపై వాదవివాదములకు గాని, విరోధమునకు గాని తావు లేదు. ఇది ఎన్నటికి మార్చ శక్యము కాని, చెక్కు చెదరని శాశ్వత సత్యము. నిన్న, నేడు, రేపు కూడా, శాశ్వతకాలము నీవు సముడవే (మార్పు లేని సత్యమే) అయి ఉన్నావు. నీవు ఎన్నడునూ పుట్టలేదు. కాని నీవు సర్వదా పుడుతూ ఉండే నిత్యనూతనమైన అనంతత్వము యొక్క సంతానమవు. నీకు పెద్ద వయస్సు అనేది ఎన్నడూ లేదు. అతిప్రాచీనదినము (కాలము) నీవే అయినప్పటికీ, నీవు



సర్వదా నిత్యనూతనమైన యౌవనము గలవాడవు. నీవు ఎన్నడునూ మరణించవు. నీవు మరింత శాశ్వతముగా జీవిస్తూ, మరింత జీవింపజేస్తూ ఉంటావు. పుట్టుట–గిట్టుట అని వర్ణించబడేవాటికి నీపై ఎట్టి ప్రభావము లేదు. అవి జీవితమనే నాటకంలో మారిపోతూ ఉండే దృశ్యములలో వచ్చిన ఘట్టములు మాత్రమే. నీవు ప్రతిరోజు దుస్తులను వేసుకుని విప్పినట్లే దేహములు పుట్టి గిట్టుతూ ఉంటాయి. దుస్తులు పాతవి అయి, రంగు మారిపోయి, చిరిగిపోతాయి. వాటి స్థానంలో కొత్త దుస్తులు నిరంతరంగా ఎన్నటికీ వస్తూ ఉంటాయి. దేహములు పుట్టుట, గిట్టుట కూడ అటులనే అంతము లేకుండా సాగిపోతూ ఉంటాయి కాని, నీవు మాత్రము ఎప్పుడూ ఒకే విధముగా, నిత్యనూతనంగా ఉంటావు. అంతే కాదు. నీవు అవికారివి! లోకము, అంటే కనబడేది, మారుతూ ఉంటుంది. నీవు కంటికి కానరాకుండా లోపల ఉంటావు! నీ దేహములు లోకమునకు చెందినవి, అనిత్యములు. కాబట్టి అవి సహజంగానే లోకము యొక్క పరిస్థితులకు లోబడి మారిపోతూ ఉంటాయి. కాని, అదంతా నీవు కాదు. నీవు ప్రపంచమునకు, నీ దేహములకు కూడ అతీతముగా, వాటి నుండి విముక్తుడవై ఉన్నావు. కాబట్టి, ఈ సత్యమునకు తగ్గట్లుగా, నీ దైవవిభూతిని నీ అనుభవమునకు తెచ్చుకో. లోకమునకు, దేహమునకు, అంతే కాదు, దేశకాలములకు కూడ, అతీతముగా పైకి లెమ్ము.

***(సశేషం...)***

---

**మాతృ ఆశ్రమం :**

1. శాంతి ఆశ్రమము
   తోటపల్లి కొండలు, పిన్ : 533446
   వయా శంఖవరం, తూ॥గో॥ జిల్లా
   ఫోన్ : 7382009962

**2. విశాఖ శాఖ : శాంతి ఆశ్రమము**
   లాసన్స్‌బే, పెదవాల్తేరు – 530 017
   విశాఖపట్నం, ఫోన్ : 0891-2538689

**3. విశ్వశాంతి క్షేత్రం,**
   కైలాసగిరి,
   విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ :**
   పీస్ సెంటర్,
   డార్‌మోనా రోడ్, కోటగిరి–643217
   నీలగిరి జిల్లా, తమిళనాడు
   ఫోన్ : 04266-271945

**5. కాకినాడ శాఖ :**
   శాంతి ఆశ్రమము, అశోక్ నగర్,
   కాకినాడ–533 004, తూ॥గో॥ జిల్లా.

**6. పిఠాపురం శాఖ :**
   స్టువర్టుపేట,
   పిఠాపురం – 533 450.

# శ్రీ రామకృష్ణ పరమహంస అవతారం

**- స్వామి రఘునాయకానంద**
శ్రీరామకృష్ణ మఠం, హైదరాబాద్

**(శ్రీ శాంతి ఆశ్రమ శత జయంతి ఉత్సవాల సందర్భంగా**
**తేది 2.8.2016న ఇచ్చిన దివ్య సందేశ సారాంశము)**

అవతారం అంటే పై నుండి క్రిందికి దిగిరావడం. అవతారం గురించి వేదకాలంలో వచ్చిన ప్రస్థావనలో “ఋషి” (మంత్ర దృష్టి) అని అంటారు. ఇంకొక పదం ఏంటంటే “ప్రాప్త” (ఆప్త) అంటే సత్యాన్ని దర్శించినవాడు అని అర్థం. “అధికారి” అంటే సత్యాన్ని దర్శించినవాడు, మరియు దాన్ని ఇతరులకు బోధించే సత్తా వున్నవాడు అని అర్థం. “ప్రకృతి లీన పురుష” అంటే ప్రకృతిని జయించినవాడు. సృష్టి రహస్యం తెలిసినవాడు అని అర్థం. సాంఖ్య యోగంలో “అల్ప నియమాక ఈశ్వర” అని అంటారు. వేదాలలో భగవంతుని రూపం ఇలా ఉంటుంది అని ఉండదు. వాళ్ళు పంచ మహాభూతాలను పూజించారు. ఇక పురాణాలకొస్తే భగవంతుడికి రూపం ఇచ్చారు. ప్రతి భగవంతునికి ఒక రూపం సృష్టించారు. అసలు భగవంతుడికి రూపం లేదు. కాని సమాజంలో సమస్యలు, కష్టాలు ఎదురైనప్పుడు భగవంతుడు ఒక రూపం తీసుకొని వస్తాడు. శ్రీరామకృష్ణులు అంటారు, నీరు ఒక దగ్గర తెల్లటి మంచుగడ్డలాగ ఉంటుంది. మరోచోట జలజలా పారుతూ ఉంటుంది. అలాగే భగవంతుడు ఒక దగ్గర రామకృష్ణుడు గానో, మరో దగ్గర జీసస్ గానో వచ్చాడు. అవతార పురుషులను దర్శిస్తే భగవంతుడ్ని దర్శించినట్లే!.

ఉపనిషత్తులో సత్యకామ జాబాలకు గురువు ఉపదేశిస్తాడు. ఈ గోవుల్ని తీసుకొని వెళ్ళి వెయ్యో, పదివేలో చేసుకొనిరా, అవే నీకు సత్యాన్ని బోధిస్తాయి. అంటే ఇక్కడ అర్థం ఏ రూపంలో భగవంతుడ్ని ఆరాధిస్తే ఆ రూపంలోనే బోధిస్తాడు. దశావతారాలు అవే. భగవంతుని రూపాలు అనంతం అని భాగవతం చెపుతుంది. యోగమాయ ద్వారా ఒక రూపం ధరించి భగవంతుడు ఎప్పుడు, ఎక్కడ, ఎలా రావాలో అలా వస్తాడు. ఉదా ॥ నరసింహావతారం. అక్కడ అలా అలా అవసరం అయినది అందుకే అలా వచ్చాడు. భగవంతుడు ఎప్పుడు వస్తాడు? తన బిడ్డలందరూ అధర్మంతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు వస్తాడు.

చైనా - భారత్ మధ్య యుద్ధం జరుగుతున్నప్పుడు అమెరికా, బ్రిటన్ ప్రెసిడెంట్లు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ గారిని అడిగారు. మేము మీకు కావాలంటే సహాయం చేస్తాము అని.



అందుకాయన మేము ఎవ్వరి సహాయం తీసుకోము. మేము ధర్మాన్ని పాటిస్తాము అని అన్నారు. విదేశీయులకు ధర్మం అంటే ఏమిటో తెలియదు. అదేదో ధర్మం అనే పెద్ద ఆటమ్ బాంబు భారతీయుల దగ్గర ఉంది అని అనుకొన్నారు. ధర్మం అనే పదమే భారతదేశాన్ని అప్పుడు, ఇప్పుడు రక్షిస్తోంది. ధర్మం తప్పినప్పుడే శ్రీకృష్ణుడు, రామకృష్ణుడు, ఓంకారస్వామి వంటివారు వచ్చారు.

అయితే, శ్రీరామకృష్ణులు రావడానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటంటే, అప్పుడు బ్రిటీష్ ప్రభుత్వం కలకత్తాను రాజధానిగా చేసుకొని భారతదేశాన్ని పరిపాలిస్తోంది. మనవాళ్ళు పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి వున్నారు. ఇప్పుడు కూడ మన పరిస్థితి అలాగే ఉంది. భగవంతుడు అంటే మర్చిపోయారు. ఆయన మీద నమ్మకం లేదు. పాలలో వెన్న వున్నట్లే, సాధన చేసి మక్కువ పడితే భగవంతుడు అనుభూతికి వస్తాడు. కాని మనవాళ్ళ దగ్గర అంత ఓపిక, ప్రయత్నము రెండూ లేవు.

లార్డ్‌మెకాలే అనే ఆంగ్లేయుడు భారతదేశంలో ఆంగ్ల విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాడు. అతడు బ్రిటీషు పార్లమెంట్‌లో ఈ విధంగా మాట్లాడారు. భారతదేశం యొక్క నలుమూలలా తిరిగాను, ఒక దొంగ గాని, ఒక అబద్ధం ఆడేవాడు గాని కనిపించలేదు. వారి సంస్కృతి సాంప్రదాయాలు అంత దృఢంగా ఉన్నాయి. భారతీయుల్ని నాశనం చేయాలంటే వారి సంస్కృతి, సాంప్రదాయాలను కూకటివేళ్ళతో సహా లాగేసే విధంగా ఆంగ్ల విద్యావిధానాన్ని అక్కడ ప్రవేశపెట్టాలి. దాని మీద వాళ్ళకు వ్యామోహం పెంచాలి. అప్పుడు వాళ్ళు వాళ్ళ సంస్కృతి, సాంప్రదాయాలకు దూరం అవుతారు అని అన్నాడు. ఈ విధంగానే భారతదేశంలో ఆంగ్ల విద్యావిధానం ప్రవేశపెట్టబడినది.

ఈ విధంగా భారతీయులు మన సంస్కృతి, సాంప్రదాయాలకు దూరం అయి భగవంతుని మీద విశ్వాసాన్ని కోల్పోయారు. అంతేకాకుండా వైష్ణవులు, శైవులు, శాక్తేయుల మధ్య విభేధాలు తలెత్తాయి. ఒకరి గుడులకు మరొకరు వెళ్ళరు. వీరి మధ్య సామరస్యం తేవడానికి రామకృష్ణ అవతారం వచ్చినది. దక్షిణేశ్వరంలో భవతారిణి కాళికా దేవాలయం ఉన్నది. అక్కడ విశేషం ఏంటంటే ఒకే ప్రాంగణలో శక్తితో పాటు, వైష్ణవాలయం, శివాలయం ఉన్నవి. అక్కడ ఆయన అన్ని దేవుళ్ళ ఉపాసన చేసి ఏ దేవుడైనా ఒకటే, ఒకరి మధ్య ఒకరికి కొట్లాట ఎందుకు? అని బోధించడం ప్రారంభించారు. బోధించడానికి ముందు దాదాపు 12 సం॥లు దక్షిణేశ్వరంలో తీవ్రమైన సాధనలు చేశారు శ్రీరాకృష్ణులు. ఆధ్యాత్మిక జగత్తులో ఎన్నిరకాల సాధనలు వున్నాయో, ఎన్ని భావాలు వున్నాయో, మార్గాలు వున్నాయో అన్నిటిని

సాధన చేసి చివరికి అన్ని మార్గాల ద్వారా భగవంతుడిని చేరవచ్చు అని బోధించడమే కాదు నిరూపించగలిగారు. రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలిలో "ఎక్కడైతే హృదయపు లోతులలో నుండి మాటలు వస్తాయో అవి వింటున్న హృదయాలలోకి చొచ్చుకొనిపోతాయి". శ్రీరామకృష్ణులకు అన్ని విధాలైన సాధనలు అయిన పిమ్మట జగజ్జనని కాళికాదేవి ఒక పని అప్పజెప్పినది. అది ఏంటంటే ఆయన పొందిన ఆధ్యాత్మిక సంపదను పదిమందికి పంచిపెట్టి జనులను సరైన మార్గంలో నడిపించాలి అని. వారంటారు భగవంతుడ్ని పొందడానికి నేను 16 అణాల సాధన చేశాను. అందులో మీరు ఒక్క అణా అంత సాధన చేస్తే చాలా మోక్షం పొందుతారు అని అంటారు. ఆయన సాధన చేసేటప్పుడు జగన్మాత సాక్షాత్కారం కోసం చీకటి పడ్డాక ప్రతిరోజు పరితపించేవారట. అమ్మా! నిన్ను చూడకుండా మరొక్క రోజు వృథాగా గడిచిపోయినదే అని కన్నీరు మున్నీరుగా 3 రోజులు ఏడిస్తే భగవత్ సాక్షాత్కారం దొరుకుతుంది అంటారు శ్రీరామకృష్ణులు. వారికి సర్వాత్మభావన కలిగిన తర్వాత, ప్రతిరోజు మేడ మీదకు ఎక్కి, నా పిల్లలారా! ఎక్కడున్నారు రండి రండి జగజ్జనని చెప్పనది మీరంతా వస్తారని! ఆ విధంగా ఏడ్చేవాడట భక్తుల రాక కోసం శ్రీరాకృష్ణులు. అంటే భగవంతుడు ఆ విధంగా భక్తుల కోసమే ఎదురుచూస్తూ వుంటాడు. అలా మొదట స్వామి వివేకానందవలె 15 మంది శిష్యులు వచ్చారు శ్రీరాకృష్ణుల చెంతకు. తర్వాత చాలామంది ఇతర శిష్యులు రావడం జరిగినది.

శ్రీరామకృష్ణులు సన్యాసా? గృహస్థులా? అంటే ఆయన ఆదర్శ సన్యాసి, ఆదర్శ గృహస్థుడు. భగవంతుని కోసం పరితపించే వారిని పిచ్చివాళ్ళుగా జమ కడతారు సమాజంలో ఆ నాడైనా, నేడైనా! అలా రామకృష్ణుల పిచ్చిని సరిచేయడానికి వారికి పెళ్లి చేయాలని వెతకడం ప్రారంభించారు వారి తల్లిదండ్రులు. వారు పేద బ్రాహ్మణులు. పైగా ప్రజల దృష్టిలో ఆయన పిచ్చివాడు. అమ్మాయిని ఇవ్వడానికి ఎవ్వరూ ముందుకు రావట్లేదు. వారి కష్టాలను చూచి స్వయంగా శ్రీరామకృష్ణులే వారికి సూచన ఇచ్చారు. జయరాంబాటిలో శారద అనే అమ్మాయి వుంది వెళ్ళి కనుక్కోండి, ఆమె నా కోసం కేటాయించబడినది అని. ఆ విధంగా శ్రీరామకృష్ణుల శారదాదేవి వివాహం జరిగినది. ఒకసారి రామకృష్ణులు, నన్ను ప్రాపంచిక విషయంలోకి లాగడానికి వచ్చావా శారదా అని అడిగితే, లేదు లేదు నేను మీ ఆధ్యాత్మిక సాధనకు సహాయకారిగా ఉండడానికి వచ్చాను అని సమాధానం ఇచ్చినది ఆమె. ఎంతటి అద్భుతమైన జీవితం వారిది! మరొకసారి శ్రీరామకృష్ణులు శారదామాతను ప్రశ్నిస్తారు. నీవు నన్ను ఎలా భావిస్తున్నావు అని. శారదాదేవి అంటారు "మా అత్తగారిని (రామకృష్ణుల తల్లి), కాళికామాతను, మిమ్మల్ని (శ్రీరామకృష్ణులని) అమ్మగానే భావిస్తున్నాను". పెళ్ళైన తర్వాత కూడ వారి భావాలు ఇలా ఉన్నాయంటే ఆదర్శ గృహస్తులు అన్నదానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి.



ఇక ఆదర్శ సన్యాసి విషయానికి వద్దాము. ఒకసారి శ్రీరామకృష్ణులు గంగా తీరానికి వచ్చి ఒక చేతిలో మట్టిని, మరోచేతిలో బంగారు నాణెములు తీసుకొని ఈ రెండూ సమానమే అని నదిలో వదిలిపెట్టేశారు. మరో సందర్భంలో రామకృష్ణులను పరీక్షించడం కోసం, ఒక బంగారు నాణెమును వారి మంచం మీద పెట్టినారు వివేకానందులు. మంచం మీద కూర్చున్న వెంటనే తుళ్ళిపడ్డారు శ్రీరామకృష్ణులు. ఏమిటా అని చూచి ప్రక్క దులిపితే బంగారు నాణెములు క్రింద పడ్డాయి. ఆ తర్వాత హాయిగా కూర్చున్నారు. వివేకానందుడు తనని ఈ విధంగా పరీక్షించినందులకు మెచ్చుకుంటారు రామకృష్ణులు.

రామకృష్ణులు వేదాంతసత్యాలను చాలా సులభంగా గ్రామీణ భాషలో చెప్పడం మొదలుపెట్టారు. వేదాంతంలో ద్వైతం, అద్వైతం అని ఉంది. కలియుగంలో భక్తిమార్గం సులువైనది అంటారు రామకృష్ణులు. కాని ఈ మార్గంలో పయనించేటప్పుడు చీరకొంగున అద్వైతాన్ని ముడిపెట్టుకో అంటారు. ఆ రోజుల్లో అద్వైతులు ద్వైతాన్ని ఖండిస్తూ ఉంటారు కాని ద్వైతులు అద్వైతులను ఖండించరు. ఎందుకంటే నాలో సాధన పరిపక్వం చెందనంత వరకు నేను మహావాక్యాల్ని – తత్త్వమసి, ప్రజ్ఞానం బ్రహ్మ అని చెప్పలేను కదా! అనుభూతిని పొందేవరకు ద్వైతంలో ఉండి సాధన చేస్తూనే వుండాలి. శమదమాది షట్క సంపత్తిని పొందితేనే స్వస్వరూపంలో ఉండడానికి సాధన చేయవచ్చు. అది అంత సులభమైన విషయం కాదు. అందుకే ముందు ఒక విగ్రహాన్ని ఆరాధించడం ప్రారంభిస్తాము. ఇక్కడ ఈ ఓంకార మందిరంలో దైవం లోపలనున్న వెలుపల చూచెదమేల? దైవం వెలుపలనున్న లోపల చూచెదమేల? అని వ్రాసి వున్నారు. ఈ భావం కలిగితే సమాజంలో అల్లకల్లోలాలు ఉండవు. తోతాపురి వంటి గురువులు ఒకరి తర్వాత ఒకరు శ్రీరామకృష్ణ దగ్గరకు వచ్చి బోధించారు. ఆ తర్వాత వారన్నారు ఈయన సామాన్యుడు కాదు, పండిత సభ పెట్టి వీరి లక్షణాలను బట్టి వీరు ఎవరు అని నిరూపించండి అని అన్నారు. అప్పుడు అందరూ కలసి రామకృష్ణులలో ఉన్న లక్షణాలను బట్టి, వీరు అవతార పురుషుడు అని చెప్పారు.

అవిద్యాయా మన్తరే వర్తమానాః
స్వయం ధీరాః పండితం మన్యమానాః
దంద్రయాన మాణాః పరియన్తి మూఢాః
అంధేనైవ నీయమానా యథాఽ౦ధాః **(కఠోపనిషత్తు)**

గ్రుడ్డివానిచేత తీసికొనిపోబడిన గ్రుడ్డివారివలె, అవిద్యలో మునిగియున్నవాడు యితరులకు మార్గదర్శి కాజాలడు. వానపాము నోటిలో పడిన కప్పకు సంకటమే, అదే జాతి పాము నోటిలో పడ్డ కప్ప క్షణంలో లోపలికి వెళ్ళిపోతుంది. కాబట్టి సాధన చేసి అనుభూతిని

పొందిన గురువు మాత్రమే శిష్యునికి ముక్తిని ప్రసాదిస్తాడు. గృహస్థులకు 4 ఉపాయములు చెప్పబడినవి. అవి నామసంకీర్తన, సాధుసాంగత్యం, స్వాధ్యాయం, ఏకాంతవాసం.

**నామసంకీర్తన :-** శ్రీరామకృష్ణులు నామ సంకీర్తన గురించి ఈ విధంగా అంటారు. చెట్టు దగ్గర నిలబడి చప్పట్లు చరిస్తే చెట్టు మీద ఉన్న కాకులు ఎగిరిపోతాయి. అదే విధంగా భగవన్నామాన్ని చప్పట్లు చరుస్తూ స్మరిస్తే మనలో వున్న పాపాలు తొలగిపోతాయి. అంతేకాదు చప్పట్లు చరుచుట వలన నరాలన్నీ ఉద్దీపన చెందుతాయి మరియు మనస్సుకు ఆనందం కూడ కలుగుతుంది. కలియుగంలో జీవులు అన్నగత ప్రాణులు. నామసంకీర్తన చేయడమే సులభము. సంకీర్తన నిరంతరం చేయాలి. కనీసం ఉదయం, సాయంత్రం, అయినా చేయాలి. ఉదా॥ పనిమనిషి యజమాని బిడ్డను తల్లిలాగ సేవిస్తూ ఉంటుంది. కాని ఆమెకు తెలుసు ఈ బిడ్డ నావాడు కాదు, నా బిడ్డ నా ఇంటిలో పూరిగుడిసెలో వున్నాడు అని. అలాగే ఈ సంసారంలో ఉన్నప్పటికి వీరంతా నావారు కాదు, భగవంతుడు మాత్రమే నావాడు అన్న ఎరుక ఎప్పుడూ లోపల ఉండాలి. బయట ఎంత పని చేస్తున్నా లోపల భగవంతుని నామస్మరణం జరుగుతూ ఉండాలి.

ఐదారు సం॥ల క్రితం Bhavan's Journal లో The Science of Self-Realization అని ఒక వ్యాసం చదివాను. ఆ వ్యాసం రచయిత ప్రయోగం చేశారో లేదా భావన చేశారో నాకు గుర్తు లేదు కానీ సారంశం ఏంటంటే, భగవంతుడి నామం ఎందుకు చెప్పాలి? చెప్పడం ద్వారా మోక్షం లభిస్తుందా? మనస్సు అనేది ఆలిచిప్ప లాంటిది. దీనిలో రకరకాల సంస్కారాలు వున్నాయి. కంటి ద్వారా చూచినవి, చెవుల ద్వారా విన్నవి వంటివి. మంచిని చూస్తే మంచి సంస్కారాలు, చెడును వింటే చెడు సంస్కారాలు ఏర్పడతాయి. భగవంతుడి నామం చాలా శక్తివంతమైనది కదా! తరచూ నామం చేయడం ద్వారా ఆ చెడు సంస్కారాలన్నింటిని ఈ భగవన్నామం తీసివేస్తుంది. చివరికి మంచి సంస్కారాలు మిగులుతాయి. అవి జ్ఞానానికి దోహదకారి అవుతాయి.

తద్వారా స్వస్వరూపం తెలుస్తుంది. అదే భగవత్ సాక్షాత్కారానికి మూలం. అలా మంత్రం చెప్పగా చెప్పగా ఆ దేవుడు ప్రత్యక్షం అవుతాడు.

తర్వాత సాధుసాంగత్యం, మనస్సును ఎప్పుడూ ఉన్నత స్థితిలో ఉంచుకోవడం కోసం రామాయణం, మహాభారతం, భాగవతం, భగవద్గీత వంటి గ్రంథాలను చదువుట స్వాధ్యాయము. చివరికి ఏకాంతవాసం, ఆశ్రమ జీవితాన్ని గడుపుతూ భగవంతుని కోసం పరితపించడం. ఈ నాలుగింటితోపాటు భగవంతుని మీద విశ్వాసం ఉండాలి. గురువు మీద విశ్వాసం ఉండాలి.



# పరోపకారార్థం - ఇదం శరీరం

- బ్రహ్మచారి హరి హర సుబ్రహ్మణ్యం

*(ఏప్రిల్ సంచికలోని ఈ వ్యాసం యొక్క ముందు భాగాన్ని ఇక్కడ ప్రచురిస్తున్నాం పొరపాటుకు క్షమాపణ వేడుతూ...)*

**ఎముకను ఇచ్చారు :-**

అరవములో "తిరుక్కురళ్" అనే ప్రాచీన గ్రంథముంది. అందులోంచి ఒక పద్యము:
"అన్బిలార్ ఎల్లాం తమక్కురియల్ అన్బుడైయార్
ఎన్బుం ఉరియర్ పిఱర్క్కు"

**పదార్థము :-**

అన్బు-ప్రేమ; ఇలార్-లేనివారు; ఎల్లాం-అన్నియు తమక్కురియర్-తమకే అంటారు. అన్బు-ప్రేమ ఉడైయార్-గలవారు; ఎన్బుం-తమ శరీరములో ఉన్న ఎముక కూడ; ఉరియర్ పిఱర్క్కు ఇతరుల కోసం అని తలంతురు.

**భావార్థము :-**

ప్రేమ లేని సంకుచిత హృదయం గలవారు అన్నియు తమదే లేదా తమది కావాలి అనియు, తమకోసమే అనియు భావిస్తారు. కాని ప్రేమపూరిత విశాల హృదయముగలవారో, తమదన్నవి అన్నియు, చివరకు తమ దేహములో ఉన్న ఎముకలు గూడ ఇతరుల కొరకే అని భావిస్తారు. ఒక అమ్మాయి కాలు ప్రమాదము వలన చితికిపోయింది. చాలా బాధగాను, నొప్పి గాను ఉన్నది. ఎనిమిది అంగుళముల ఎముక ఎవరి శరీరములోనుంచైనా తీసి, ఆ బాలిక కాలులో అమర్చితేనే ఆమె నడుచును. నొప్పియు బాధను తీరును, అని డాక్టర్లు చెప్పారు. పూజ్య ఓంకారస్వామి తన ఎడమకాలి ఎముకను ఆమెకోసం ఇచ్చారు.

భాగవత పురాణములో (స్క 6, అ-9,10) ప్రస్తావింపబడిన దధీచి మహర్షి కథను ఇది గుర్తుకు తెస్తుంది. విష్ణుభగవాన్ సలహా మేరకు దేవతలు దధీచి మహర్షిని తన ఎముకను ఇవ్వమని ప్రార్థించారు. దేహానుబంధము లేని ఆ మహర్షి తన యోగ శక్తితో దేహము త్యజించారు. దేవశిల్పి విశ్వకర్మ ఆయన ఎముకలతో వజ్రాయుధం చేసి ఇంద్రునికి ఇచ్చాడు. భగవంతుని కృపవలన, వజ్రాయుధముతోనూ ఇంద్రుడు వృత్రాసురుని చంపగలిగాడు.

వేదము, ప్రభు సంహిత. అందులో కొన్ని పిట్టకథలు వున్నా, తరచు అది సూత్ర ప్రాయంగాను, ఒక ప్రభువు తన పని మనుషులకు చెప్పేటట్లూ ఆదేశరూపంగా తన బోధనలను ఇస్తుంది. ఇతిహాస పురాణాలు ఆ ఆదేశాలను కథ రూపంగా చెప్తాయి. కథలు మనుష్య మనస్సును ఆకట్టుకుంటాయి. తేనె కలిపి ఇచ్చిన ముందులాగ, మనుష్యులు సులభంగాను, ఉత్కంఠతోను స్వీకరిస్తారు. మరి ఆ ఉపదేశాలు వారి మనస్సులలో పాతకుంటాయి. ఆధునిక

జగత్తు ఒకరు ఆ ఆదేశాన్ని తన జీవనములో ఆచరించి చూపితే దాని యొక్క ప్రభావము ఇంకా అధికమౌతుంది. దానాన్ని ఈ క్రింది మాటలతో తైత్తిరీయోపనిషత్ నొక్కి వక్కాణిస్తుంది: "శ్రద్ధయా దేయం! అశ్రద్ధయా దేయం! శ్రియాదేయం! హృదయాదేయం! భియాదేయం! సంవిదాదేయం!"

భగవాన్ శ్రీకృష్ణుడు కూడా భగవద్గీతలో చెప్పియున్నాడు (అ:17-18). భాగవతం దధీచి, బలి కథలలో దానాన్ని శ్లాఘించింది కాని '20'వ శతాబ్దిలో ఉన్న ఓంకార్‌స్వామి జీవన సంఘటన యొక్క ప్రభావం తెలిసినవారి మనసులలో ఇంకా విశిష్టమైనది.

**అవకాశాన్ని కనిపెట్టి పట్టుకోవడం :-**

ఆ పాప యొక్క తండ్రి పెద్ద కుటుంబాన్ని పోషిస్తున్నారు. బాధ్యతాయుతమైన ఉద్యోగము. తన ఎముకను కూతురుకిచ్చి నెలల తరబడి మంచము పట్టడం సాధ్యము కాదు. ఎందరినో కోరారు. ధనమిస్తానన్నారు కాని, కాలి ఎముకను ఇచ్చుటకు ఎవరూ ముందుకు రాలేదు. వైజాగ్ శాంతి ఆశ్రమమును అనుకొనియున్న ప్రకృతి చికిత్స కేంద్రానికి వచ్చారు. అక్కడున్న యోగి పెదవి విరిచారు. నిరాశతో, పిల్లను చేతులతో మోసుకుని శాంతి ఆశ్రమములో అడుగుపెట్టారు. వారిని చూసి, అడిగి విషయం తెలుసుకున్న స్వామి నేను నా ఎడమకాలి ఎముకను ఇస్తానన్నారు. వచ్చినవారు స్వామి ఆశీర్వాదము కోసమే వచ్చారు. కాని, ఒక గొప్ప ఉపకారం చేసే అవకాశమును కనిపెట్టిన ఓంకార్‌స్వామి, దాన్ని పట్టుకున్నారు. నా ఎముక ఇస్తాను అన్నారు. వైజాగ్ ఆసుపత్రివారితో మాట్లాడి, కావలసిన ఏర్పాట్లు చేయమన్నారు.

తరువాత జరిగిన సంఘటనల నుండి ఇది స్పష్టమవుతుంది. "ఆ తండ్రి ఏమీ చేయలేదు. ఊరక ఉన్నారు. కొన్నిరోజులు వేచియుండి, ఓంకారస్వామి, ఆ తండ్రిని ప్రేరేపించి ఆపరేషన్ చేయించుకున్నారు. ఎముకను దానమిచ్చారు.

"1970"లో ఓంకారస్వామి తన ఆత్మకథ వ్రాసారు. అందులో తన జీవితములో ఉత్కృష్టమైన రెండు సందర్భాలను గురించి చెప్పారు. 1) ఆకస్మాత్తుగా తనంతట "ఆత్మానుభూతి" కలగడం. 2) ఆగష్టు 1950లో ఆ బాలికకు "చిన్న" ఉపకారం చేయగలగడం. ఇది చిన్న ఉపకారమట! అది నా జీవితములో ఒక సుదినమంటారు స్వామీజీ. రామకృష్ణ పరమహంసలు ఒకప్పుడు పరోపకారాన్ని శ్లాఘిస్తూ మాట్లాడారు. వెంటనే వారి భావం మారింది. "ఛీ, ఎవరు ఎవరికి ఉపకారం చేసేది? అన్నారు. అప్పుడు నరేన్ (తరువాత కాలములో స్వామీ వివేకానంద) అక్కడ ఉన్నాడు. పరమహంసుని మాట, నరేన్ మనస్సుని కదల్చివేసింది. ఎంత అమూల్యమైన మాట. అవకాశం దొరికితే నేనీమాటను ప్రపంచానికి చాటి చెప్తాను" అన్నాడు.

కాని ప్రాప్త-ప్రాప్తవ్యులైన (అనగా పొందవలసిన వానినన్నిటిని పొందిన) ఓంకారస్వామి వంటి వారికి ఇది తమ ఉద్ధారణ కోసం చేసే పని కాదు. లోక సంగ్రహార్థం చేసిన సేవ.



# శాంతి స్థాపనం - ముక్త జీవనం

***(శాస్త్ర ప్రవచనములు - మహనీయుల మాటలు - స్వాముల సందేశముల సమాహారము)***

- **కె. రత్తయ్య**, మాతృ ఆశ్రమం

**శ్రీ భగవానువాచ :-**

"విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిఃస్పృహః
నిర్మమో నిరహంకార; సశాన్తి మధి గచ్ఛతి" ***(గీత. 2-71)***

(ఎవడు సమస్తమైన కోరికలను, శబ్దాది విషయములను త్యజించి వాని యందే మాత్రము ఆశ లేక, "నేను", "నాది" యను అహంకార మమకార వర్జితుడై ప్రవర్తించునో అట్టివాడు శాంతిని పొందును)

**1. "శాంతి నీ జన్మ హక్కు" - పూజ్యశ్రీ ఓంకారస్వామి సూక్తి**

**2. "వ్యక్తి శాంతియే విశ్వశాంతికి మూలము" - శాంత్యాశ్రమ ముఖ్య సూత్రము**

**3. "హృదయవాసియగు భగవంతుని అస్తిత్వమును గుర్తించి, శాంత్యానందములు పొందుట." - శాంత్యాశ్రమ వాసి లక్ష్యము.**

శాంత్యాశ్రమ గౌరవాధ్యక్షులుగా పూజ్యశ్రీ చిదానంద స్వామి వారు ఒకానొక సందర్భములో ఇచ్చిన సందేశము మనము ముందుగా తెలుసుకుందాము.

నిత్యఆత్మలారా! శాంతి ఆశ్రమవాసులారా! సాధకులారా! మనము ఆశ్రమ జీవితం గడుపుతున్నాము. ఈ ప్రపంచమూ, బయటి ప్రపంచము వంటిదే. ఇక్కడ ద్వంద్వాలున్నాయి. అహంకార మమకారాలున్నాయి. సత్వ, తమో, రజో గుణాలున్నాయి. రాగద్వేషాలున్నాయి. అయితే, ఆశ్రమ జీవితం ఎలా గడపాలన్నది మన విచక్షణాబుద్ధిపై ఆధారపడియున్నది. శాంత్యాశ్రమములో తోటపల్లి కొండల మధ్య ఉంటూ ఎందుకొచ్చామో మరిచిపోతే నష్టపోయేది మనమే. పవిత్రాత్ములైన 'శ్రీ ఓంకారస్వామి' వారి బోధలు, పూజ్య 'జ్ఞానేశ్వరి' మాతాజీ వారి ప్రశాంత జీవనస్రవంతి మనకు ఆదర్శం, మార్గదర్శకత్వం కావాలి. మనము సాధనా మార్గములో ఏ కొద్ది పురోభివృద్ధియైనా సాధించాలంటే, సత్వభావానికి స్వాగతం చెబుతూ, తమోగుణాన్ని త్యజిస్తూ, రజోగుణాన్ని స్వాధీనపరచుకుని, ద్వంద్వాల మధ్య విచారణ విమర్శలతో ప్రయాణిస్తూ ఉండాలి. అట్టి స్థితిలో ఫలితం మనకు తప్పకుండా లభిస్తుంది.

ఈ ప్రపంచం ద్వంద్వ భూయిష్టమని మనకు వేదాంతము ప్రబోధిస్తుంది. పుట్టిన నాటి నుంచి, సుఖదుఃఖాలు, శోకహర్షాలు, లాభనష్టాలు, జయాపజయాలు, అన్నీ మనము అనుభవించాము. అయినా మనము అసలు "తత్త్వం" తెలుసుకునే ప్రయత్నము చేయము. పూర్తి లౌకిక సంసారములో మునిగిన వ్యక్తి అలాంటి ఆలోచన చేయకపోతే ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. కాని మనం ఆశ్రమవాసులం. మనకలాంటి జిజ్ఞాస కలుగకపోతే, మనం చాలా దీనావస్థలో ఉన్నామని గ్రహించాలి. జీవితం దుఃఖరహితముగా ఎలా గడపాలో తెలుసుకోవాలి. సత్యమేది? ముక్తి ఎక్కడ? మార్గమేది? ఈ ప్రశ్నలు సదా సాధకుని మదిలో మెదులుతుండాలి.

ఈ లోకములో సాధారణముగా ఎక్కువమంది ఏమీ తెలుసుకోకుండా జీవిస్తుంటారు. ఎంతో కొంత తెలుసుకున్న వాళ్ళు కొద్దిమంది ఉంటారు. జగత్తు, జీవుడు, దేవుడు గురించి తెలిసినవాళ్ళు బహు అరుదు. అట్టివారు మాటలతో కాలక్షేపం చేయరు. ఆశ్రమవాసులలా ఉండాలి. నిత్యశోధన – సాధన వారి మార్గం కావాలి.

జీవుడికి సహజంగానే అజ్ఞానం వెంట వస్తుంది. దాని ప్రభావముతో అన్నింటికి తానే కర్తననీ, తానే భోక్తననీ, అనుకుంటాడు. ఆ విధముగా జననమరణాది బంధాల్లో చిక్కుకుంటాడు. ఇదంతా అవిద్య, అజ్ఞానం. ఈ అజ్ఞానాన్ని తొలగించుకోవాలి.

కాలం చాలా విలువైనది. మాంధాత వంటి చక్రవర్తులు, అశోకుడు వంటి రాజులు, చాణుక్యుడి వంటి నీతికోవిదులు, కాళిదాసువంటి కవులు, కాలగర్భములో కలిసిపోయారు. కాలమెవరి మీద దాక్షిణ్యం చూపదు. ఎవరికోసమూ ఆగదు. కావున విజ్ఞులైన ఆశ్రమవాసులు కాలము సద్వినియోగము చేసుకోవాలి. వ్యర్థపు మాటలతో, రచ్చబండ రాజకీయములతో, స్వార్థపు ఆలోచనలతో తాము నష్టపోయి, ఆశ్రమ వాతావరణము కలుషితము చేయరాదు.

శాంతి మీ హృదయములలో ఎన్నో రూపాలలో పిత్రార్జిత మూలధనముగా యున్నది. అయితే అనిత్యమయిన విషయాలకు ప్రాధాన్యత నిచ్చి వాని వెంట పరుగిడి మనం ఉన్న శాంతిని వదులుకుంటున్నాము. హృదయాంతర్గతమైన మహా పెన్నిధిని నిర్లక్ష్యం చేస్తున్నాము. మనల్ని మనము మోసము చేసుకుంటున్నాము. మీరు విజ్ఞతతో "సత్యాన్ని యోచించండి". ఆ "సత్యములో జీవించండి". మానవుడిని భగవంతుని సన్నిధికి చేర్చేది ఆ సత్యమే. ఈ మహాసత్యాన్ని దృఢపరుచుకుని, నిశ్చయబుద్ధితో వ్యవహరిస్తే మనస్సు శాంతపూర్ణమై యుంటుంది. పూజ్య గురుదేవుల కరుణ వలన మీకాశాంతి ప్రాప్తించు గాక.

పూజ్యశ్రీ ఓంకారస్వామి బోధించిన శాంతిని, పూజ్యశ్రీ చిదానంద స్వామి ప్రభోధించిన సత్యమును శోధించుటకు అందులో జీవించుటకు మనము విచారణ మార్గములో మరింత ముందుకెళ్దాము.



నువ్వు ఆనంద స్వరూపుడివి అంటుంది వేదం. కాదు పొమ్మంటుంది జీవితం.

**1) "సుఖం" – "శారీరకం", 2) "సంతోషము" – మానసికము", 3) ఆనందము – ఆత్మ స్వరూపము.** దురదృష్టవశాత్తూ సామాన్యమానవుడీ మూడు ఒక్కటేయని, అవి వస్తువులలో దొరుకుతాయనే భ్రమతో, వాటిని సొంతం చేసుకోవడానికి, అన్ని విలువలకు తిలోదకాలిస్తాడు. అవి దొరికినా, దొరక్కపోయినా అంతిమముగా మిగిలేది దుఃఖమే.

జాతిపిత ఒక మాట చెప్పారు. "ఆనందం అనేది నువ్వు ఏమేమి పొందావనే దానికన్నా, ఏమేమి వదులుకున్నావనే దాని మీద ఆధారపడియుంటుంది". ఎంత గొప్ప సత్యము. విచారించాలి. లోకములో ఒక సూక్తియుంది. మనిషైనవాడు ప్రాణులను ప్రేమించాలి. వస్తువులను వాడుకోవాలి. నేటి నాగరికుడు, వస్తువులను ప్రేమిస్తూ సాటి మనుషులను వాడుకుంటున్నాడు. అదే తెలివి అనుకుంటున్నాడు. కనీసము, కన్నవారిపై ప్రేమ మృగ్యమై, మృగాల కన్నా హీనముగా జీవిస్తున్నాడు. మనిషి మెదడుతో కాదు, హృదయముతో బ్రతకడము నేర్చుకోవాలి. అదీ అసలైన తెలివి.

ఈ ప్రపంచములో యున్న సరంజామా మొత్తము పరమాత్మ అధీనము. ఆయన అనుజ్ఞ లేకుండా ఏది పొందడానికి వీల్లేదంటుంది వేదం. ఇచ్చింది పుచ్చుకో, ఆనందముగా అనుభవించు. అందని దాని కోసం అర్రులు చాచకు. అక్రమముగా సొంతం చేసుకుని, తర్వాత దుఃఖించకు అంటుంది ఉపనిషత్తు.

మానవుని దుఃఖానికి, తద్వారా అశాంతికి, రెండు కారణాలు చెప్తారు అనుభవజ్ఞులు. 1) ఉన్నదానితో తృప్తి పడకపోవడం, 2) లేని దానికోసం ఆరాటపడటం. మాయా మోహితులై జనులు ప్రపంచమే వాస్తవమని భ్రమిస్తున్నారు. విషయవాసనలే సత్యముగా భావిస్తున్నారు. లౌకిక వస్తువులు నిత్యమని నమ్ముతున్నారు. పర్యవసానం తమ స్వరూపమేమిటో మరిచి పోతున్నారు. ఇందులో నుంచి బయటపడే మార్గము లేదా? ఆలోచించాలి. అంతేగాని భయపడిపోయి నిరాశ నిస్పృహలతో జీవించకూడదు. మరణం ఒకసారే రావాలి. భయంతో క్షణం క్షణం చస్తూ, బ్రతికేవాళ్ళు ఏమి సాధించలేరన్నారు వివేకానందులవారు. భర్తృహరి "సర్వం వస్తుభయాన్వితం భువి" అని తీర్మానము చేసి, భయము లేనిది ఒకటియుంది. అదే వైరాగ్యము" అని తేల్చేశారు. భగవానుడు గీతలో "అభయం" దైవీగుణములలో మొదటిగా చెప్పి, అభ్యాస వైరాగ్యములతో సమత్వం సాధించు. అర్జునా! అన్నారు. కావున మనము భయ రహితులమై శాంతి మార్గము పట్టాలి.

మనిషి ప్రశాంత జీవనముతో ఆనందముగా ఉండాలంటే ఆధ్యాత్మిక మార్గము

వినా మరోదారి లేదంటాడు ఆధునిక గురువు శ్రీ జిడ్డు కృష్ణమూర్తి. ఆధ్యాత్మిక మార్గమంటే అద్వైతం. ఏది అద్వైతం? ఎటు చూచినా వేర్వేరుగా కనిపించే ఈ జగత్తులో అభిన్నముగా చూచే చూపు అద్వైతం. ఈ భిన్నత్వం గానీ, అభిన్నత్వం గానీ ప్రధానముగా యుండేది జీవుడికీ, దేవుడికీ మధ్యనే. కనుక బేధం ద్వైతమయితే, అబేధం అద్వైతము. ఈ అద్వైతములో ముఖ్యముగా మూడు విషయాలు కనబడతాయి.

**శ్లో॥ "శ్లోకార్ధేన ప్రవక్ష్యామి, యదుక్తం గ్రంథ కోటిభిః**
**బ్రహ్మసత్యం, జగన్మిథ్య, జీవో బ్రహ్మైవ న పరః"**

(ఎన్నో గ్రంధముల సారమిదే. ఆధ్యాత్మికోన్నతికి చెందినవారు సచ్చిదానంద పరబ్రహ్మమును తెలుసుకున్న జ్ఞానులు ఘంటాపథంగా చెప్పే సత్యమిదే)

**1) బ్రహ్మసత్యం 2) జగన్మిథ్య 3) జీవుడే బ్రహ్మ**

ముందు బ్రహ్మ (ఆత్మ)ను గురించి తెలుసుకునే ప్రయత్నము చేద్దాము.

**బ్రహ్మము :-** ఈ ఆత్మ విచారణ **"కేనోపనిషత్తులో"**లో చేయబడింది. ఈ విచారణ ద్వారా సాధకుడు తన "స్వరూపం యొక్క స్ఫూర్తిని" కొంతమేరకు పొందగలడు. 'కేన' అనగా దేని చేత అనే ప్రశ్నతో గురుశిష్యుల సంభాషణ ప్రారంభమవుతుంది.

**శిష్యుడు :-** గురుదేవా! ప్రాణము దేని వలన తన పనిని చేస్తుంది? వాక్కులు దేని వలన మానవులు పలుకుతున్నారు? కన్నులను, చెవులను ఏ దేవుడు నియమిస్తున్నాడు? మనస్సు ఇంద్రియాలపై దేనివలన పడుతుంది?

**గురువు :-** అది 'నేను' అనబడే ఆత్మ. ఆ 'నేను' వలన చెవి వింటుంది. కన్ను చూస్తుంది. వాక్కు వస్తుంది. ప్రాణాలు పనిచేస్తాయి. మనస్సు గ్రహిస్తుంది. అయితే దేని నుండి ఇవన్నీ నియమింపబడుతున్నాయో, అక్కడకు కన్ను పోలేదు, చెవి వినలేదు, మాటలు వెళ్ళలేవు, మనస్సు కూడ పోజాలదు. మనస్సు చేత ఏది గ్రహింపబడదో లేక గ్రహింపశక్యము కాదో, దేని చేత మనసుకు గ్రహించే శక్తి కలుగుతుందో అది బ్రహ్మము. దీనిని మీకు ఎలా నేర్పించాలో మాకు తెలియదు. ఎవరికి వారే సాక్షాత్కరింపజేసుకోవాలి. అది తెలిసి వాటికన్నా భిన్నమైనది. తెలియని దానికన్నా శ్రేష్ఠమైనది అని మేము మా గురువుల వద్ద విన్నాము.

బ్రహ్మ మొక్కటే సత్యం, నిత్యం అన్నారు శంకరాచార్యులవారు. ఆయనను దర్శించడం ఎలా? సకల ప్రాణులు ఆనందంగా జీవించడానికి, ఈ సుందరమైన లోకాన్ని, దానిని పరిరక్షించడానికి దేవగణాల్ని సృష్టించిన భగవంతుడు తనను, ఎక్కడా బహిర్గతం చేసుకోలేదు.



ఈ పరమసత్యము తెలుసుకుంటే భగవంతుని సర్వత్రా దర్శించడానికి సాధకునికి గమ్యం సులభమవుతుంది. ప్రతి జీవుని హృదయము నందు పరమాత్మ సూక్ష్మములో సూక్ష్మముగాను, గొప్పలో అతిగొప్పగాను యున్నాడు. అంతరంగమందున్న అట్టి ఆత్మ సందర్శనము కలిగిన క్షణముననే దుఃఖరాహిత్యము అనంతానంద ప్రాప్తి కలుగును. అదే మోక్షము లేక ముక్తి. మోక్షమనగా సకల బాధల నుండి విముక్తి నొంది ఉత్కృష్టానందమును పొందుటయని అర్థము.

సాధకుడు ఇంకా లోతుకు వెళ్ళేముందు, తన ఉపాధియైన శరీరము, మనస్సు, ఆవశ్యకమైన కర్మ గురించి కూడ పరిపూర్ణ జ్ఞానము కలిగియుండుట అవసరము.

**శరీరము :-** శరీరమనగా శిధిలమైపోవునదని అర్థము. **పూజ్యశ్రీ శివానందుల వారు** ఈ దేహము గురించి చెప్పేమాట. "ఈ శరీరము చెఱసాల. జీవుడిందులో బందీయైయున్నాడు. ఇంద్రియములు రక్షకులుగా యున్నవి. అరిషడ్వర్గములను అదుపులో యుంచి, ఇంద్రియములను నిర్వీర్యము చేసి విముక్తి పొందవలెను. **"శరీరమాద్యం ఖలుధర్మసాధనం"** అన్నారు కాళిదాసు. కావున జీవించినంతకాలము శరీరమునకు పోషణ, రక్షణ తప్పదు. అంతకు మించి శరీరాన్ని గూర్చి చింతన చేయరాదు. ఎందుకంటే మనల్ని క్రిందకు దిగలాగి దగా చేసేది ఈ శరీరమే. సంగత్వం, దేహాత్మ భ్రాంతి ఇవే మన దుఃఖాలకు కారణం. రహస్యము ఏమిటో తెలుసా? నేనీ దేహాన్ని కాను, ఆత్మను. ఈ సమస్త ప్రపంచం, దానిలోని సకల సంబంధాలు, మంచి చెడులు, సుఖ దఃఖాలు, ఇవన్నీ ఒకే తెరమీద చిత్రీకరించిన బొమ్మల వంటివి. వీటన్నిటినీ చూస్తూ ఉండే ద్రష్టను నేనే" అని నిరంతరమూ మననం చేసుకుంటూ ఉండాలి.

**మనసు :-** మనో విశ్లేషణ మహామహా యోగులకే సాధ్యము కాలేదు. మనస్సు జగత్తుకు జన్మస్థానం. బ్రహ్మం మనస్సుకు మూలం. అంటే జగత్తుకు, బ్రహ్మకు మధ్యన మనస్సు ఉంది. జ్ఞానాన్ని ఆర్జించేది అలా ఆర్జించిన జ్ఞానాన్ని వ్యక్తం చేసేది మనసే. అయితే దానికి స్వభావమే గాని స్వరూపము లేదు. స్థిరత్వం లేదు. దాని స్వభావము బుద్ధి. భౌతిక, ఆధ్యాత్మిక సంబంధమైన దేనిని గురించి తెలుసుకోవాలన్నా, తెలియచెప్పాలన్నా మనసే ఆధారం. మరో మార్గం లేదు.

**"నిన్ను నీవు తెలుసుకో"** అనే విశ్లేషణలో కూడ మనసు, తనను తాను ప్రశ్నించుకుని, దానికి తానే సమాధానం చెప్పుకోవలసియుంది. ఇది మనసు లక్షణం. అందుకే మనసుకు మీనింగ్ (Meaning) ఆత్మకు (Scaning) స్కానింగ్ లేదన్నాడో ఇంగ్లీషు తత్త్వవేత్త. ఆరెంటికీ స్పష్టమైన నిర్వచనం లేదు. అవి అంతే. నమ్మకము, శాస్త్రం, అనుభవము అన్నీ సమన్వయము చేసి అర్థము చేసుకోవాలి, అంగీకరించాలి. ఈ మనస్సును జయించడానికి భగవదనుగ్రహం

కావాలి. సద్గురువు కావాలి. సద్గురువు సత్యం కాకపోయినా జనన, మరణ సాగరాన్ని దాటడానికి నావలా సహకరిస్తాడు. **శ్రీ రమణ మహర్షి** మాటల్లో... మనసు సహజముగా తిరుగుబోతు. అది పుడుతూ, మునుగుతూ యుంటుంది. అందుచేత శాశ్వతమైనది కాదు. కానీ, నీవో శాశ్వత స్వరూపుడవు. మనస్సుని గురించి చికాకు పడవద్దు. మనస్సు యొక్క పుట్టుక స్థానమైన ఆత్మను పట్టుకో. మనస్సు అదృశ్యమవుతుంది.

**కర్మ :–** సాధకుని అనాదిగా వేధిస్తున్న ప్రశ్న. కర్మ గొప్పదా? జ్ఞానం గొప్పదా? ఈ సంశయము భారతములో అర్జునునకు, రామాయణములో రామునికి కలిగింది. జ్ఞానవాశిష్టములో శ్రీరాముడు వశిష్ఠుని "గురుదేవా! మోక్షానికి అనువైనది కర్మ లేక జ్ఞానమా? నాకు వివరించండి" అని కోరినప్పుడు –

మహర్షి వశిష్ఠులు "నాయనా! ఒక పక్షి ఎగరాలంటే రెండు రెక్కలుండాలి అలాగే మోక్షగామి అయిన మానవునికి కర్మము, జ్ఞానమనే రెండు రెక్కలుండాలి. వీటిలో కర్మ అనే రెక్క వలన చిత్తశుద్ధి, జ్ఞానం అనే రెక్క వలన అవిద్య నివృత్తి జరుగుతుంది. కర్మ గురించి మరికొంత వివరిస్తాను. జాగ్రత్తగా విను శ్రీరామా! కర్మ రెండు రకములు 1) ప్రస్తుత కర్మ 2) గత జన్మల కర్మ (ప్రారబ్ధం). ఒక్కోసారి ఈ రెండు కర్మలు ఒకదానికొకటి అనుకూలముగా యుంటాయి. మరియొకసారి రెండూ వ్యతిరేకముగా యుంటాయి. అటువంటి వ్యతిరేక స్థితిలో ఏ కర్మ ప్రభావము అధికముగా యుంటే ఆ కర్మే జయిస్తుంది. అంటే ప్రస్తుత కర్మ ఫలితము అధికముగా యుంటే, అంటే బలమయినదయితే అదే జయిస్తుంది. ఇది చాలా కీలకమైన వాస్తవము. సాధకుడు దీనిని పట్టుకోవాలి. పట్టుబట్టి తీవ్రతరమైన పురుష ప్రయత్నముతో ఆపదలు, అనర్థాలు కలిగించే పాత కర్మను పటాపంచలు చేయాలి.

*(సశేషం...)*

---

పుణ్యము వలన సుఖం కలుగుతుంది. పాపము వలన దుఃఖము వస్తుంది. మానవులు పుణ్యము చేయుటకు ఇష్టపడరు. కానీ పుణ్యము యొక్క ఫలము అనగా సుఖము కావాలని కోరుకుంటారు. పాపాలను చేయడం మాత్రం మానరు కదా! ఎంత విచిత్రం. గతంలో చేసిన పాపఫలితాలే రోగాల రూపంలో, కష్టాల రూపంలో ప్రత్యక్షమై మనలను బాధిస్తుంటాయి. ఔషధం చేత, దానం చేత, జప హోమాల చేత దేవతలను పూజించడం వలన అవి తొలగిపోతాయి.

**– శ్రీ రమణ భగవాన్**



విజ్ఞప్తి !

# గోశాల పునర్నిర్మాణము

**ఓం నమో భగవతే ఓంకారాయ**
**ఓం నమో భగవతే వాసుదేవాయ**
**ఓం శ్రీ గోమాత్రే నమః**

దివ్యాత్మ స్వరూపులకు ప్రణామములు. పూజ్య ఓంకారస్వామి స్థాపించిన గోశాలలో గోవులు – 25, దూడలు – 30, గిత్తలు – 7, దినాభివృద్ధి గావింపబడుతున్నాయి. గోఘృతంతో నిత్యం ప్రణవ హోమం నిర్వహించబడుచున్నది. గురుకుల బాలబాలికలకు, ఆశ్రమ వాసులకు గోక్షీరము వినియోగింపబడుచున్నది. గోమాతలు వశించు గోశాల శిథిలావస్థకు వచ్చినది. పూజ్య స్వామీజీ వారి ఆశీస్సులతో గోశాల పునర్నిర్మాణము చేయుటకు పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీవారు సంకల్పించిరి. గోమాతలు నివశించుటకు 5 షెడ్డులు అవసరమున్నవి. ఒక షెడ్డు నిర్మాణమునకు సుమారు రూ॥ 5,00,000/– (ఐదు లక్షలు) ఖర్చు అగునని నిర్ధారణ చేయబడినది.

రూ॥ 10,000/– (పదివేలకు) పైన ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకము మీద వ్రాయబడును. ఒక రోజునకు ఒక ఆవుకు గ్రాసము ఖర్చు రూ॥ 150/–. ఒక నెలకు ఒక ఆవుకు గ్రాసము ఖర్చు రూ॥ 4,500/– అగును. వారి వారి శక్తి అనుసారము గ్రాసమునకు దాతలు సహకరించవలసినదిగా మా విన్నపము. గోగ్రాసమునకు సమర్పించిన దాతల నామ గోత్రములతో, గోవులకు గ్రాసము అందించబడును. ఒక గోవునకు సమర్పించిన గ్రాసము 10 అశ్వమేధ యాగములకు సమానము అని గోమహత్యంలో చెప్పబడినది.

ఆశ్రమ శ్రేయోభిలాషులు, గోమహత్యం పట్ల విశ్వాసం ఉన్న వాళ్ళు గోశాల పునర్నిర్మాణము మరియు గోగ్రాసము కొరకు ధన రూపంలో లేదా డి.డి. గాని, చెక్కు గాని శ్రీ శాంతి ఆశ్రమం పేరున విరాళము పంపగలరని విజ్ఞప్తి. మీ విరాళమునకు 80జి ప్రకారము ఇన్‌కంటాక్సు మినహాయింపు కలదు.

**ఓం తత్‌సత్**

గురుసేవలో

*– వినమ్రానంద సరస్వతి*

# వార్తలు - మాతృ ఆశ్రమం

**ది. 03.02.2017 : రథసప్తమి** సందర్భముగా శ్రీ సూర్యనారాయణ అష్టోత్తర శతనామార్చన బ్రహ్మశ్రీ సాంబమూర్తి గారిచే నిర్వహించబడినది.

**ది. 07.02.2017 : భీష్మఏకాదశి** సందర్భముగా భగవద్గీత పారాయణం ఆశ్రమ వాసులచే ప్రార్ధనా మందిరంలో జరిగెను.

**ది. 24.03.2017 : మహాశివరాత్రి** సందర్భముగా సహస్ర జ్యోతిర్లింగార్చన శ్రీ ఓలేటి సత్యనాఆయణ (అన్నవరం దేవస్థానం) బృందం వారిచే విశ్వనాథ మందిరము నందు జరగెను. ఆశ్రమవాసులే కాక, పరిసర గ్రామ భక్తులు కూడ పాల్గొనిరి.

**ది. 29.03.2017 : ఉగాది** సందర్భముగా శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామార్చన, పంచాంగ శ్రవణం శ్రీ గంగరాజు మాష్టారు వారిచే జరుపబడినది ప్రార్ధనా మందిరములో. మరియు పూజ్యశ్రీ స్వామి దేవానంద వారి ఆధ్వర్యంలో వసంత నవరాత్రుల సందర్భంగా “అధ్యాత్మ రామాయణం” పారాయణం ప్రారంభించబడి శ్రీరామనవమి వరకు (ది. 05.04.2017) జరిగినది. అదే రోజులలో ప్రతిరోజు సాయంత్రం వారిచే ఆధ్యాత్మ రామాయణం ప్రవచనం జరిగినది. ఆశ్రమవాసులందరూ పాల్గొనిరి.

**ది. 29.04.2017 : అక్షయతృతీయ** సందర్భముగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అష్టోత్తర శతనామార్చన, **ది. 30.04.2017న శ్రీ శంకర జయంతి** సందర్భముగా శ్రీ శంకరాచార్యుల అష్టోత్తర శతనామార్చన, శ్రీ గంగరాజు మాష్టారు వారిచే నిర్వహించబడినది.

**బ్రహ్మలీన చిదానందస్వామి జన్మతేది 24న,** ప్రతి నెలవలె ఈ నెల కూడ మాతృ ఆశ్రమం, కాకినాడ, పిఠాపురం, కోటగిరి, విశాఖ శాఖలలో వృద్ధులకు బియ్యము, పప్పు వితరణ జరుగెను.

# వార్తలు - కాకినాడ

**ది. 25.03.2017 - ది. 03.03.2017 :** శ్రీ సత్యసాయి జ్ఞానమండలి వారిచే “జ్ఞాన-వైద్య-యోగ శిక్షణ” 10 రోజులు ఉదయం, సాయంత్రము ఇవ్వబడినది. శ్రీ భిక్షమయ్య గురూజీ వారి శిష్యులు శ్రీ రఘుజీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వడం జరిగినది. సుమారు 150 మంది శిక్షణలో పాల్గొనిరి.

---

గాలి తాకిడికి మేఘం తొలగిపోయేట్లు మనస్సును ఆవరించి ఉన్న ప్రాపంచికత్వమనే మేఘం భగవన్నామ స్మరణచే తొలగిపోతుంది.

**- శారదామాత**



# శాశ్వత అన్నదాన పధకము

| | | |
|---|---|---|
| 1. | రూ. 10,000-00 | శ్రీ ఐ. వేంకటేశ్వరస్వామి గారు, శ్రీ ఐ. నరసింహమూర్తిగారు, శ్రీ ఐ. సత్యనారాయణగార్లు, హైదరాబాద్ వీరి తల్లి కీ॥శే॥ శ్రీమతి ఐ. సావిత్రి గారి జ్ఞాపకార్ధం. |
| 2. | రూ. 25,000-00 | శ్రీమతి ప్రశాంతి మలిశెట్టి గారు, బెంగుళూరు వీరి తల్లిగారు కీ॥శే॥ మలిశెట్టి సత్యరాణి గారి జ్ఞాపకార్ధం |
| 3. | రూ. 5,000-00 | శ్రీమతి అరిగెల లీలారావు గారు, పుట్టపర్తి వీరి సహోదరుడు రావూరి మురళీధరరావు గారి (USA) పుట్టినరోజు |
| 4. | రూ. 5,000-00 | శ్రీ టి.ఆర్.కె. జనార్ధన్ గారు, బెంగుళూరు వీరి తండ్రిగారు కీ॥శే॥ తణుకు వెంకట సుబ్బారావుగారి జ్ఞాపకార్ధం |
| 5. | రూ. 5,000-00 | శ్రీ టి.ఆర్.కె. జనార్ధన్ గారు, బెంగుళూరు వీరి తల్లిగారు కీ॥శే॥ తణుకు సత్యవతి గారి జ్ఞాపకార్ధం |
| 6. | రూ. 5,000-00 | శ్రీ గరికపాటి నటేష్ గారు, C/o. గరికపాటి లక్ష్మి గారు, శ్రీ శాంతి ఆశ్రమం, వీరి తల్లిగారు కీ॥శే॥ గరికపాటి లలితాంబ గారి జ్ఞాపకార్ధం |
| 7. | రూ. 5,000-00 | శ్రీ బి. సత్యనారాయణరావు గారు, విశాఖపట్నం కీ॥శే॥ బి. వెంకటరావు గారి ఆత్మశాంతి కోరుతూ |
| 8. | రూ. 10,000-00 | శ్రీ గవరసాన సత్యనారాయణ గారు, శ్రీమతి సుభద్ర గార్లు, గొల్లప్రోలు వీరి తండ్రిగారు కీ॥శే॥ గవరసాన వెంకన్న గారి ఆత్మశాంతి కోరుతూ |
| 9. | రూ. 10,000-00 | శ్రీ గవరసాన సత్యనారాయణ గారు, శ్రీమతి సుభద్ర గార్లు, గొల్లప్రోలు వీరి తల్లిగారు కీ॥శే॥ గవరసాన అప్పల నరసమ్మ గారి ఆత్మశాంతి కోరుతూ |
| 10. | రూ. 5,000-00 | శ్రీ సుంకర నాగేశ్వరరావు గారు, అమలాపురం వీరి తల్లిదండ్రులు కీ॥శే॥ సత్యం గారు, తల్లి కీ॥శే॥ శ్రీమతి సూరమ్మ గారు మరియు భార్య కీ॥శే॥ శ్రీమతి సుబ్బలక్ష్మి గార్ల జ్ఞాపకార్ధము |
| 11. | రూ. 5,000-00 | శ్రీ నున్న నరసింహారావు గారు, శ్రీమతి అప్పల లక్ష్మి గారు, ఏలేశ్వరం వీరి 50వ పెండ్లిరోజు సందర్భముగా |
| 12. | రూ. 5,000-00 | శ్రీ యల్. రవీంద్రబాబు గారు, రాజమండ్రి వీరి పుట్టినరోజు సందర్భముగా |
| 13. | రూ. 5,000-00 | శ్రీమతి బి.బి. వేదకేతన్ గారు, హైదరాబాద్ వీరి పుట్టినరోజు సందర్భముగా |
| 14. | రూ. 5,000-00 | శ్రీమతి అట్లూరి కమల గారు, గుంటూరు-34, వీరి తల్లిదండ్రులు కీ॥శే॥ శ్రీమతి అట్లూరి సరస్వతి గారు, కీ॥శే॥ అట్లూరి సోమసుబ్రహ్మణ్యం గార్ల ఆత్మశాంతి కోరుతూ |
| 15. | రూ. 5,000-00 | శ్రీమతి ఆలూరి ప్రభావతి గారు & సత్సంగ సభ్యులు, కాకినాడ. సత్సంగ సభ్యులు ఆయురారోగ్యభోగభాగ్యములు కోరుతూ, సత్సంగ అభివృద్ధి కోరుతూ |
| 16. | రూ. 15,000-00 | శ్రీ గుమ్మళ్ళ సత్యనారాయణ గారు, శ్రీమతి బాపనమ్మ అనే వరాలమ్మ గార్లు, జె.తిమ్మాపురం, వీరి కుమారుడు కీ॥శే॥ వీర వెంకట సత్య సూర్య ప్రసాద్ గారి జ్ఞాపకార్ధం, ఆత్మశాంతి కోరుతూ |
| 17. | రూ. 10,000-00 | శ్రీమతి రక్షా బాలన్, హైదరాబాద్ On the Occasion of Her Birthday |
| 18. | రూ. 5,000-00 | శ్రీ గొల్లపూడి కామేశ్వరరావు గారు (తాతగారు) వీరి భార్య కీ॥శే॥ శ్రీమతి గొల్లపూడి మహాలక్ష్మి గారి జ్ఞాపకార్ధము |
| 19. | రూ. 5,000-00 | శ్రీమతి దంగేటి రత్నం గారు, జగ్గంపేట వీరి భర్త కీ॥శే॥ కశింకోట్ల రాజబాబు గారి జ్ఞాపకార్ధము |
| 20. | రూ. 10,000-00 | శ్రీ తణుకు రామకృష్ణ జనార్ధన్ గారు, శ్రీ శాంతి ఆశ్రమం వీరి సోదరులు కీ॥శే॥ తణుకు రామకృష్ణరావు గారు, కీ॥శే॥ తణుకు సూర్య వెంకటరత్నం గార్ల ఆత్మశాంతి కోరుతూ |